తిరునాళ్ల ఏర్పాట్లు.. ఊసేదీ?



నిధులు ఎలా..?

తిరునాళ్ళ ఏర్పాట్లకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి. తిరునాళ్ళకు ప్రభుత్వం ప్రత్యేక పండుగ హోదా కల్పించింది. గత ఐదేళ్లుగా ప్రభుత్వం నిధులు విడుదల చేయడంలేదు. స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు మాత్రమే రూ.10 వేలు నిధులు విడుదల చేసి చేతులు దులుపుకుంటోంది. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఏటా రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షలు విడుదల చేసేవారు. తిరునాళ్లకు దాదాపు రూ.1.50 కోట్ల ప్రభుత్వం బకాయి ఉంది. మళ్ళీ తిరునాళ్ళ వస్తున్నా ప్రభుత్వం నుంచి ఈ నిధుల్లో రూపాయి కూడా విడుదల కాలేదు. ఆర్ అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, అగ్నిమాపక, వైద్య ఆరోగ్య శాఖ, ఆర్టీసీలకు తిరునాళ్ళ సందర్భంగా జరిగే ఏర్పాట్లకు నిధులు విడుదల చేయాలి. ఆయా శాఖల అధికారులు ఏర్పాట్ల కోసం నిధులు సమకూర్చుకోవటంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏటా జరిగే సమీక్షా సమావేశాల్లో నిధుల సమస్యలను ప్రస్తావిస్తున్నా దీనికి శాశ్వత పరిష్కారం లభించటం లేదు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు తిరునాళ్ళ ఏర్పాట్ల పై దృష్టి సారించాలి.

పనిచేయని మోటార్లు..

కొండ దిగువన చెరువుల్లో నీరు అడుగంటింది. దీంతో బోర్ల నీటిపైనే దేవస్థానం ఆధారపడాల్సి ఉంది. కొండ దిగువన తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో రెండు బోర్లు నిర్మించి వీటికి మోటార్లు ఏర్పాటు చేశారు. కొండ దిగువన సంపు నిర్మించి బోర్ల నీటిని పంపి అక్కడ నుంచి కొండపైకి పంపింగ్ చేసేవారు. ఈ విధానాన్ని కూడా దేవస్థానం అటకెక్కించింది. ఈ బోర్లకు మోటార్లు కూడా పనిచేయడంలేదు. ఒక బోరును నిరుపయోగంగా వదిలేశారు. ఇటీవల ఓ దాత మోటారు విరాళంగా ఇవ్వడంతో దాంతో నీటిని కొండపైకి సరఫరా చేస్తున్నారు. రెండు బోర్లు, వాటికి రెండు మోటార్లు సిద్ధం చేయకుంటే తిరునాళ్ల రోజున నీటి సమస్య తలెత్తే అవకాశం ఉంది. ఒక వేళ చిలకలూరిపేట మేజర్‌కు నీరు విడుదల చేయకపోతే భక్తుల స్నానాలకు నీటిని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. నీటికోసం ముందస్తుగా ఇప్పటినుంచే ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై తక్షణమే దృష్టి సారించాలి. లేకుంటే తిరునాళ్ల రోజున భక్తులు నీటి కష్టాలను ఎదుర్కోక తప్పదు. దేవస్థాన అధికారులు, ఆర్ డబ్ల్యుఎస్, జలవనరుల శాఖ అధికారుల మధ్య నీటి సరఫరాలో సమన్వయం అవసరం.

ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వరస్వామి సన్నిధిలో మహా శివరాత్రి పర్వదినాన జరిగే తిరునాళ్ళ దేశ ప్రసిద్ధి. వచ్చేనెల 8న తిరునాళ్ళ జరగనుంది. ఏకాదశి రోజున తిరునాళ్ళ మహోత్సవాలు ప్రారంభ మవుతాయి. ఇంకా సమయం 25 రోజులే ఉంది. అయినా అధికారులు తిరునాళ్ళ ఏర్పాట్ల ఊసే ఎత్తటం లేదు. నేటి వరకు ఏర్పాట్ల పై సమీక్షలు నిర్వహించ లేదు. ఈ తిరునాళ్ళకు ప్రభుత్వం రాష్ట్ర పండుగ హోదా కల్పించినా ఏటా నిధులు విడుదల చేయటం లేదు. దీంతో దాతల విరాళాల పైనే వివిధ శాఖలు ఏర్పాట్ల కోసం ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది.

- కోటప్పకొండ తిరునాళ్ళ ఏర్పాట్ల మాటెత్తని యంత్రాంగం
- 25 రోజుల్లో త్రికోటేశ్వరస్వామి తిరునాళ్ళ మహోత్సవాలు
- రాష్ట్ర పండుగ హోదా కల్పించినా నిధులు విడుదల కాని వైనం



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కోటప్ప కొండ తిరునాళ్ళ గడువు సమీపిస్తోంది. అయినా సంబంధిత శాఖ లు ఏఏ ఏర్పాట్లు చేయాలనే అంశంపై స్పష్టత రాలేదు. పోలీసు, దేవాదాయ, ఆర్‌డబ్ల్యుఎస్, విద్యుత్, అగ్నిమాపక, ఆర్టీసీ, పంచాయతీ రాజ్, వైద్య ఆరోగ్యం, అటవీ, రెవెన్యూ తదితర శాఖలు తిరు నాళ్ళ ఏర్పాట్లలో కీలక పాత్ర పోషిం చాల్సి ఉంది. తాగు నీరు, పారిశుధ్యం, యాత్రికుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి. కొండ దిగువున, కొండ ఎగువున కోటయ్య స్వామి సన్నిధిన విస్తృత ఏర్పాట్లు చేయాలి. లక్షలాది మంది భక్తులు సులువుగా స్వామివారిని దర్శించు కొనేందుకు క్యూలైన్‌లు ఏర్పాటు చేయాలి. కొండకు వేలాది వాహనాలు తరలి వస్తాయి. నరసరావుపేట, చిలకలూరిపేట, పెట్లూరివారిపాలెం, అవిశాయపాలెం రహదారుల్లో వాహనాల రాకపోకలు ఉంటాయి. ఈ రహదారులకు అవ సరమైన చోట్ల మరమ్మతులు చేపట్టాలి. ఏటా తిరునాళ్ళ సందర్భంగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. దీనికి శాశ్వత పరిష్కారం చూపటంలో అధికారులు విఫల మవుతున్నారు.

పొంచి ఉన్న నీటిగండం..

తిరునాళ్ళకు తరలి వచ్చే యాత్రికుల కోసం తాగు నీటి వసతి కల్పించాలి. ఈ దిశగా ఇప్పటి నుంచే చర్యలు చేపట్టాల్సి ఉండగా ఇందుకు జరుగుతున్న ప్రయత్నాలు లేవు. ఈ ఏడాది నీటి గండం పొంచి ఉంది. ఏటా చిలకలూరిపేట మేజర్‌కు సాగర్ నీటిని సరఫరా చేస్తారు. ఈ ఏడాది ఆ పరిస్థితులు కానరావడంలేదు. జలాశయాల్లో నీటి నిల్వలు నిండుకోవడంతో కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే సాగర్ నుంచి నీటి విడుదల చేస్తున్నారు. డ్యాంల నిర్వహణ కేఆర్‌ఎంబీ చేతుల్లో ఉంది. సాగర్ నుంచి తిరునాళ్ల కోసం నీటిని విడుదల చేయాలంటే ఖచ్చితంగా రివర్ బోర్డు అనుమతి తీసుకోవాల్సిందే. తాగు నీటి అవసరాలకు నీటిని విడుదల చేసే షెడ్యూల్‌ను ముందుగానే ప్రకటించారు. ఏప్రిల్ నెలలో తాగు నీటి అవసరాల కోసం సాగర్ నుంచి నీటిని విడుదల చేస్తారు. తిరునాళ్ళకు నీటి కోసం కేఆర్‌ఎంబీ అనుమతి ముందుగానే తీసుకోవాల్సి ఉంది. ఈ అంశం లో సంబంధిత అధికారులు లేఖలు పంపాలి. ముందస్తు అనుమతి తీసుకోకుంటే తిరునాళ్ల జరిగే మార్చి 8 కల్లా నీరు వచ్చే పరిస్థితి ఉండదు. యంత్రాంగం వెను వెంటనే అప్రమత్తం కావాల్సి ఉంది.

తిరునాళ్ల తర్వాత రండి!

- పాత ఈవోనే కొనసాగుతారు
- కోటప్పకొండ ఏసీకి అధికార పార్టీ నేత హుకుం
- జాయినింగ్ రిపోర్టు ఇచ్చినా విధులు చేపట్టనివ్వలేదు
- చేరకుండా తామే అడ్డుకున్నామంటూ వైపీసీ నేత ప్రచారం



ఆ సీట్లో కూర్చోవద్దు.. తిరునాళ్ల తర్వాత రండి.. అప్పటివరకు పాత ఈవోనే కొనసాగుతారంటూ అధికార పార్టీ నేత ఏసీకి హుకుం జారీ చేశారు. నందివెలుగు గ్రూప్ దేవాలయాల ఈవోగా పనిచేస్తున్న నల్లకాలువ శ్రీనివాస రెడ్డి ప్రమోషన్‌పై కోటప్పకొండ దేవస్థానం ఏసీగా నియమితులయ్యారు. ఆయన శుక్రవారం జాయినింగ్ రిపోర్టును దేవస్థాన కార్యాలయంలో అందజేశారు. అయితే అయన విధులు చేపట్టకుండా అధికార పార్టీ నేతలు అడ్డుకున్నారు. శనివారం కూడా దేవస్థానానికి శ్రీనివాసరెడ్డి వచ్చారు. విధులు చేపట్టవద్దని సదరు నేతలు అడ్డుకోవడంతో అయన కంగుతిన్నారు. చేసేదేమి లేక తన సీట్లో కూర్చోకుండానే వెనుదిరిగారు. కోటప్పకొండలో చక్రం తిప్పుతున్న వైసీపీ నేత ఏసీగా శ్రీనివాసరెడ్డి బాధ్యతలు స్వీకరిస్తే తన అక్రమాలు సాగవని ఏసీని విధుల్లో చేరకుండా అడ్డుకుంటున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఇన్‌చార్జ్ ఈవోగా శ్రీనివాసరెడ్డి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఏసీగా ఎన్.శ్రీనివాసరెడ్డి జాయినింగ్ రిపోర్టు ఇచ్చినా నిబంధనలకు విరుద్ధంగా ఈవోను కొనసాగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కోటప్పకొండ తిరునాళ్ల మార్చి 8న జరగనుంది. తిరునాళ్ల పూర్తయ్యేవరకు ఏసీని విధుల్లో చేరకుండా అడ్డుకుంటే తన అక్రమాలకు అడ్డంకి ఉండదనే ఉద్దేశ్యంతోనే ఏసీని విధుల్లో చేరనివ్వడం లేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రముఖ పుణ్యక్షేత్రం కోటప్పకొండలో కూడా అధికార పార్టీ నేతల మితిమీరిన జోక్యం పెరగడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తిరునాళ్ల వరకు ఏసీ శ్రీనివాసరెడ్డి విధుల్లో చేరనిచ్చేది లేదని సదరు నేతలు గొప్పగా ప్రచారం చేసుకుండటం గమనార్హం. తిరునాళ్ల కొనుగోళ్లలో అక్రమాలకు ఇక అడ్డంకి లేకుండా పోతుందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

తీరం.. పరాధీనం



సీఆర్‌జెడ్ పరిధిలో చేపడుతున్న నిర్మాణాలు



రిసార్ట్ ముందు తీరంలో పూర్తి స్థాయిలో చదును చేసిన దృశ్యం

- సీఆర్‌జెడ్ పరిధిలో అక్రమ నిర్మాణాలు
- బీచ్ వ్యూ పేరుతో మడచెట్ల తొలగింపు
- నిబంధనలు పట్టని రిసార్ట్స్ నిర్వాహకులు
- క్యాంప్ ఫైర్ పేరిట మందు, చిందు, విందు

చీరాల, ఫిబ్రవరి 10: అధికారుల నిర్లక్ష్యంతో తీరం పరాధీనం అవుతోంది. ప్రశ్నించేవారు లేకపోవడంతో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయి. తీరం వెంట రక్షణగా ఉండాల్సిన మడచెట్లు కనుమరుగవుతున్నాయి. తీరంలో రాత్రి వేళల్లో క్యాంప్ ఫైర్ పేరుతో మందు, చిందు, విందులకు తలుపులు బార్లా తెరిచారు. సీఆర్‌జెడ్, రెవెన్యూ, ఫారెస్ట్, ఔడా, పోలీస్ తదితర శాఖల అధికారులు చేపట్టాల్సిన చర్యలు నామ మాత్రంగా కూడా ఉండటం లేదనే విమర్శలున్నాయి. చీరాల నియోజకవర్గ పరిధిలో ఆహ్లాదం, ఆటవిడుపు కోసం వాడరేవు, రామాపురం, కఠారివారిపాలెం, పొట్టిసుబ్బయ్యపాలెం తదితర ప్రాంతాలు టూరిజంగా అభివృద్ధి చెందుతున్నాయి. దీంతో ఆ ప్రాంతాల్లోని రిసార్ట్ నిర్వాహకులు కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సీఆర్‌జెడ్(కోస్టల్ రెగ్యులైజేషన్ జోన్) పరిధిలో ఎలాంటి శాశ్వత కట్టడాలు(పైన శ్లాబు వేస్తూ) నిర్మించకూడదు. అయితే కొందరు సీఆర్‌జెడ్ పరిధిలో శాశ్వత కట్టడాలు నిర్మిస్తున్నారు. బీచ్ వ్యూ పేరుతో పర్యాటకులను ఆకర్షించేందుకు మడచెట్లను తొలగిస్తున్నారు. మత్స్యకారులకు వేట నిషేధిత సమయంలో జీవనోపాధి కోసం తీరం వెంట ఉన్న అటవీశాఖ భూములను కేటాయించారు. లీజు పేరుతో ఖరీదు కట్టి రిసార్ట్ నిర్వాహకులు ఆయా స్థలాలను స్వాధీనం చేసుకుంటున్నారు. కాల గమనంలో రిసార్ట్స్ ఒకటి తర్వాత ఒకటిగా వెలు

లీజు పేరుతో స్థలాలు స్వాధీనం

స్తున్నాయి. పర్యాటకులను ఆకర్షించేందుకు పోటీపడి వనరులు, వసతులు సమకూరుస్తున్నారు. అందులో కొందరు నిబంధనలను అతిక్రమిస్తున్నారు. రాత్రి వేళల్లో క్యాంప్ ఫైర్ల పేరుతో తీరంలో ఓపెన్ బార్లను తలపిస్తూ, నిప్పుల నెగడుల మధ్య టేబుల్స్ వేసి మద్యం తాగేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. చిన్న, చిన్న ఫంక్షన్లు, పార్టీల పేరుతో అర్ధరాత్రి వరకు మందు, చిందు, విందులతో పలుచోట్ల గానాబజానాలు బహిరంగంగా జరుగుతున్నాయి. రిస్టార్స్‌ల్లో ఏ ఒక్కరికి కూడా పూర్తిస్థాయిలో అనుమతులు లేవని సమాచారం. అయితే కొన్నింటికి మాత్రం పాక్షిక అనుమతులు ఉన్నట్లు సమాచారం. వాస్తవానికి రెవెన్యూ, ఫారెస్ట్, సీఆర్‌జెడ్, ఔడా, పోలీస్ అనుమతులు తప్పనిసరి. అందులో ఆయా శాఖలకు సంబంధించి అప్పుడప్పుడు మొక్కుబడిగా నోటీసులు ఇవ్వటం తప్పించి క్షేత్రస్థాయిలో నిబంధనలను అమలు పరచడంలో విఫల మవుతున్నారు. అదేమని ఎవరన్నా అడిగితే తమకు ప్రాక్టికల్ ప్రాబ్లమ్స్ చాలా ఉంటాయి.. అర్థం చేసుకోండని అంటున్నారు.



తీరంలో చెట్లను కొట్టివేయటంతో ఖాళీగా ఉన్నప్రదేశం

అపశ్రుతులు.. ప్రమాదాలు

తీరంలో నానాటికీ అపశ్రుతులు పెరుగుతున్నాయి. ప్రధానంగా పర్యాటకులు సముద్ర స్నానాలకు దిగినపుడు కొన్ని సందర్భాల్లో అలల్లో చిక్కుకుని మృత్యువాత పడుతున్నారు. దీనికి సంబంధించి అధికారులు చర్యలు తీసుకుంటున్నామని చెప్తున్నా ప్రమాదాలు జరగటం మాత్రం ఆగటం లేదు.

అమ్మకానికి ఊర చెరువు



ఊరచెరువును ఆక్రమించి ఇళ్ల స్థలాలుగా మారుస్తున్న ప్రాంతం

- ఇప్పటికే 35 ఎకరాల ఆక్రమణ
- తాజాగా మరో రెండు ఎకరాల్లో ప్లాట్లు
- చెరువు కట్టను జరిపి మరీ ఆక్రమణలు
- అధికారుల బదిలీతో అమ్మకాలు వేగవంతం
- అధికారమే పెట్టుబడిగా వైసీపీ నేతల ఆక్రమణలు

అద్దంకి, ఫిబ్రవరి 10: అధికారం ఉంది.. అడిగేవారు లేరు.. వైసీపీ నేతలు చెలరేగిపోతున్నారు. ఏకంగా చెరువులోనే పాగా వేసేశారు. దీంతో అద్దంకి పట్టణంలో అంతర్భాగమైన ఉత్తర అద్దంకి రెవెన్యూ 95 సర్వే నెంబరులోని ఊర చెరువు ఆక్రమణలతో కుదించుకుపోయింది. అయినా అధికార పార్టీ నేతలు ఈ చెరువును మరింతగా ఆక్రమించేశారు. దీంతో సుమారు 125 ఎకరాల విస్తీర్ణంలోని ఊరచెరువు నానాటికీ కనుమరుగవుతోంది. మూడు దశాబ్దాల క్రితం నుంచి పలు సందర్భాలలో సుమారు 35 ఎకరాల వరకు చెరువు ఆక్రమణకు గురై ఏకంగా పెద్దకాలనీ ఏర్పడింది. 20వ వార్డులో 90 శాతం గృహాలు చెరువును ఆక్రమించి ఉన్నవే అంటే ఆశ్చర్యం కాదు. అవకాశం వచ్చిన ప్రతిసారి ఆక్రమణదారులు కొంతమేర చెరువును ఆక్రమించడం సొమ్ము చేసుకోవడం పరిపాటిగా మారింది. ఊరచెరువు అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి గత ఏడాది నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో ఎన్టీఆర్ కాలనీ వైపు ఆక్రమణలు పోను మిగిలిన భాగంలో కట్ట ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. అయితే, కట్ట ఏర్పాటు సమయంలోనే స్థానిక వైసీపీ నేతలు చక్రం తిప్పి సుమారు 2 ఎకరాల వరకు వదిలేసి కాలనీకి దూరంగా కట్ట వేయించారు.



ఆక్రమించిన భూమిలో ఏర్పాటు చేసిన హద్దురాళ్లు

అప్పట్లోనే దీనిపై ఆంధ్రజ్యోతిలో కథనాలు వచ్చినా అధికారులు పట్టించుకోలేదు. కట్టను వంకరగా తిప్పి తాము ఆక్రమించిన స్థలాన్ని వదిలేసి నిర్మాణం చేయిస్తున్నారు. కట్టను దూరంగా వేయించడంతో ప్రస్తుతం ఆక్రమణలకు మరింత సులువుగా మారింది. ఎన్నికల నేపథ్యంలో రెవెన్యూ అధికారుల బదిలీతో ఆక్రమణదారులు ఇళ్ల స్థలాలుగా మార్చి అమ్మకాలు చేపట్టడం వేగవంతం చేశారు. కొత్త అధికారులు కుదుటపడే లోపే అమ్మకాల పనిని చక్కబెట్టుకునే పనిలో వైసీపీ నేతలు నిమగ్నమయ్యారు. అయితే, మొత్తం ఒకేసారి ప్లాట్లుగా వేస్తే అలజడి వస్తుందని డబ్బులు ఇచ్చిన వ్యక్తులకు ప్లాట్లుగా విభజించి అమ్మకాలు చేస్తున్నారు. ఒక్కో ప్లాటును రెండు నుంచి మూడు సెంట్లుగా వేసి రూ.రెండున్నర లక్షల నుంచి రూ.4 లక్షల చొప్పున అమ్మకాలు చేస్తున్నారు. ఆక్రమిత భూమి ద్వారా సుమారు రెండున్నర కోట్ల నుంచి మూడు కోట్ల రూపాయలు సొమ్ము చేసుకునే పనిలో సదరు నేత నిమగ్నమయ్యారన్న విమర్శలున్నాయి. చెరువు భూమి ఆక్రమించి ప్లాట్లుగా వేసి అమ్మకాలు చేస్తున్నా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించడంపై విమర్శలు వస్తున్నాయి.

చర్యలు చేపడతాం

ఊరచెరువులో ఆక్రమణల విషయం మా దృష్టికి రాలేదు. వెంటనే సిబ్బందిని పంపించి ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. - షేక్ మహబూబ్ సుభాని, తహసీల్దార్

జగనన్న ప్లాట్.. రూ.50 వేలు

చేతులు మారిన రూ.50 లక్షలు?

- వేటపాలెం తహసీల్దారు కార్యాలయంలో పైరవీలు
- స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు పలువురు సిద్ధం

వేటపాలెం(చీరాల), ఫిబవరి 10: ప్రతీ పనికో రేటు.. పైసలు ఇస్తేనే పనులు.. వేటపాలెం తహసీల్దార్ కార్యాలయంలో పైరవీకారుల రాజ్యం నడుస్తుందని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. రూ.50 వేలు ఇస్తే జగనన్న కాలనీల్లో నివేశన స్థల పట్టా పొందవచ్చనే సారాంశంతో ఓ ఆడియో తాజాగా సోషల్ మీడియాలో హల్‌చల్ అవుతోంది. ఆ ఆడియోలో ధనుంజయ్ అనే వ్యక్తి అవతలి వ్యక్తితో మాట్లాడుతూ గతంలో రూ.20 వేలు చెప్పారు.. తర్వాత రూ.30 వేలు అన్నారు.. ఇప్పుడు ఏకంగా రూ.50 వేలు అంటున్నారు. ధర ఏమైనా తగ్గుతుందా అని అడగటం, అవతలి వ్యక్తి అందరం పంచుకోవాలి... అధికారికే రూ.30 వేలు ఇవ్వాలి.. కాబట్టి ధర తగ్గదని చెప్పడం జరిగింది. ఈ ఆడియోపై మండల పరిధిలో జోరుగా చర్చ నడుస్తోంది. ఇదిలా ఉంటే జనన సర్టిఫికెట్లకు సంబంధించి కూడా డబ్బు వసూలు చేస్తున్నారన్న విమర్శలున్నాయి. చల్లారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని కొణిజేటి చేనేతపురి, కొణిజేటినగర్, జగనన్న కాలనీల్లో కొన్ని ప్లాట్లు ఖాళీగా ఉన్నాయి. వీటిని ఓ మధ్యవర్తి ద్వారా ఇతరులకు అమ్మి సొమ్ము చేసుకునేందుకు రెవెన్యూ యంత్రాంగంలో కొందరు పావులు కదిపారు. ఒక్కో పట్టాకు రూ.50 వేల వరకు వసూలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. అక్కాయిపాలెం పంచాయతీ పరిధిలోని అబ్దుల్ కలామ్‌కాలనీలో కూడా నగదు తీసుకుని పలువురికి పట్టాలు ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. వంద పట్టాలకు సుమారు రూ.50 లక్షలు చేతులు మారినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయంలో కొందరు స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లుతెలిసింది.

జనన సర్టిఫికెట్లకూ వసూళ్లు

జనన సర్టిఫికెట్ లేనివారు అది కావాలంటే ఓ మధ్యవర్తిని ఆశ్రయిస్తే పని పూర్తి అవుతుంది. అతడు తాను వసూలు చేసిన నగదును ఏ సీటుకు ఎంతివ్వాలో అంతిచ్చి సర్టిఫికెట్‌ను దరఖాస్తుదారులకు అందజేస్తున్నట్లు కార్యాలయానికి వచ్చేవారు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ఉన్నతాధికారులు తహసీల్దార్ కార్యాలయంపై దృష్టి సారించి విచారణ చేపడితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ప్రజలు అంటున్నారు.

ఎస్ఎస్ ట్యాంకులో 20 అడుగుల నీరు

బాపట్ల, ఫిబ్రవరి 10: డెడ్‌స్టోరేజికి చేరిన బాపట్ల పట్టణ సమ్మర్‌స్టోరేజి(ఎస్ఎస్) ట్యాంక్‌ను ఎట్టకేలకు 20 అడుగుల నీటితో నింపారు. నాలుగు రోజులుగా రాత్రి పగలు 17 ఇంజన్లతో పీటీ చానల్ కాల్వ నీటిని ఎస్ఎస్ ట్యాంక్‌లోకి తరలిస్తున్నారు. దీంతో 24 అడుగుల సామర్థ్యం కలిగిన చెరువులో 20 అడుగుల వరకు నీటిని నింపారు. ఇంకా నీటిని పంపింగ్ చేస్తున్నారు. అయినా రోజుమార్చి రోజు మాత్రమే పట్టణ వాసులకు తాగునీటిని సరఫరా చేయగలమని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. రోజుమార్చి రోజు వచ్చే నీరు చాలక పట్టణవాసులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. గత ఏడాది నవంబరులో కాల్వలకు నీరు వచ్చినప్పుడు చెరువును నింపారు. ఆ తర్వాత నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయని నీరు విడుదల చేయకపోవడంతో చెరువులో నీరు అడుగంటి తాగునీటి సమస్య తలెత్తింది. ప్రస్తుతం నింపిన నీటితో మూడు నెలలు తాగునీటి అవసరాలు తీర్చుకోవచ్చు. ఏప్రిల్‌లో నీరు రాకపోతే పరిస్థితి ఏమిటని అధికారులు ఆలోచనలో పడ్డారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న నీటిని రోజు మార్చి రోజు సరఫరా చేయాలని ఆలోచన చేస్తున్నారు. ఏప్రిల్‌లో మరోసారి కాల్వలకు నీరు విడుదల చేస్తామని ఇరిగేషన్ అధికారులు హామీ ఇస్తే ప్రతిరోజు తాగునీటిని సరఫరా చేస్తామని, లేకుంటే రోజుమార్చి రోజు నీటిని అందిస్తామని మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి తెలిపారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులతో పట్టణంలోని మినరల్ వాటర్ ప్లాంట్ల వారు డబ్బులు పోసుకుంటున్నారు. క్యాన్ వాటర్‌కి గిరాకీ పెరిగింది.



ట్యాంక్‌లో నీటి పరిమాణాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ కె.రామచంద్రారెడ్డి



దిక్సూచి DIKSUCHI

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ జాగ్రఫీ

నీటి పారుదల

పంటలకు కృత్రిమంగా నీటి వసతిని కల్పించడాన్నే నీటి పారుదల అంటారు. 1950-1951లో నీటి పారుదల వసతులు 22.6 మిలియన్ హెక్టార్లకు కల్పించగా... ప్రస్తుతం 139.89 మిలియన్ హెక్టార్లకు నీటి సౌకర్యం ఉంది.

భారతదేశంలో నీటి పారుదల ప్రధానంగా మూడు మార్గాలపై ఆధారపడి ఉంది. అవి.. బావులు, కాలువలు, చెరువులు.

బావులు: భారతదేశంలో అత్యధికంగా(62 శాతం) నీటి పారుదల బావుల ద్వారానే కల్పిస్తున్నారు. విస్తీర్ణపరంగా ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్, శాతం పరంగా గుజరాత్‌లో అధికంగా నీటి పారుదల వసతులున్నాయి. బావులు రెండు రకాలు... గొట్టపు బావులు, సాధారణ బావులు. ఉత్తరప్రదేశ్‌లో బావులు అత్యధికంగా ఉన్నాయి.

కాలువలు: భారతదేశంలో 24 శాతం నీటి పారుదల కాలువల ద్వారా సమకూరుతోంది. విస్తీర్ణపరంగా ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్; శాతంపరంగా పంజాబ్‌లో అధికంగా కాలువల ద్వారా నీటి పారుదల కల్పిస్తున్నారు.

చెరువులు: దేశంలో 3 శాతం నీటి పారుదలను చెరువుల ద్వారా కల్పిస్తున్నారు. విస్తీర్ణపరంగా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ; శాతం పరంగా తమిళనాడులో అధికంగా చెరువుల ద్వారా నీటి పారుదుల సౌకర్యం ఉంది. చెరువులు ప్రధానంగా దక్షిణ భారత దేశంలోనే ఉన్నాయి. అత్యధిక నీటి పారుదల సాంద్రత పంజాబ్‌లో ఉంది. అత్యల్ప నీటి పారుదల సాంద్రత మిజోరంలో కలదు. ఇక భారతదేశంలో ఇతర నీటిపారుదల వసతులు 11.07 శాతం ఉన్నాయి.

ఆనకట్ట రకాలు

1. భూభాగ నిర్మాణం ఆధారంగా

చెక్ డ్యామ్స్: చిన్న చిన్న నీటి ప్రవాహాలకు అడ్డంగా నిర్మించేవి

డ్రై డ్యామ్స్: వర్షాభావ ప్రాంతాల్లో నేలల సంరక్షణ కోసం ప్రవాహ దిశను మళ్లిస్తూ నిర్మించేవి.

సాడిల్ డ్యామ్స్: ప్రధాన ఆనకట్ట కారణంగా లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికాకుండా నిర్మించే ఆనకట్టలు

డైక్ డ్యామ్స్: సాడిల్ ఆనకట్ట లక్షణాలతో ప్రధాన ఆనకట్టను పోలివుండే వాటిని డైక్ డ్యామ్స్ అంటారు.

కాఫర్ డ్యామ్స్: నీటిలో మునిగి ఉన్న ప్రాంతంలో నిర్మాణాలు చేయడానికి ఆ నీటిని తొలగించడం కోసం నిర్మించే డ్యామ్స్

ఓవర్ ఫ్లో డ్యామ్స్: నది నుంచి లేదా ఆనకట్ట నుంచి ప్రవహిస్తున్న నీటిని శాస్త్రీయంగా లెక్కించడానికి నిర్మించే ఆనకట్టలు

2. డిజైనింగ్, ఇంజనీరింగ్ ఆధారంగా

గ్రావిటీ డ్యామ్స్: భారీ కాంక్రీట్ డ్యామ్‌లను గ్రావిటీ డ్యామ్‌లు అంటారు. లోతైన పునాదులతో నిర్మిస్తారు.

ఆర్చ్ డ్యామ్స్: వి ఆకారంలో ఉండే నదీలోయలకు అడ్డంగా నిర్మిస్తారు.
ఉదా: ఇడుక్కి-కేరళ(ఎత్తు 169 మీ.)

ఎమ్ బ్యాంక్ మెంట్ డ్యామ్స్: రాళ్ల మధ్య ఖాళీలను మట్టి లేదా కాంక్రీట్‌తో పూడ్చుతారు. వీటిలో ఎర్త్ ఫిల్ డ్యామ్, రాక్ ఫిల్ డ్యామ్, రబ్బర్ డ్యామ్, ఆస్పేట్ డ్యామ్ ఉన్నాయి.

3. నీటి నిల్వ సామర్థ్యం ఆధారంగా/ఆయకట్టుకు నీటిని అందించే సామర్థ్యం ఆధారంగా

భారత ప్రణాళికా సంఘం మన దేశంలోని నీటి పారుదల ప్రాజెక్టులను ఆయకట్టు ప్రాంతం ఆధారంగా మూడు విధాలుగా వర్గీకరించింది.

భారీ తరహా ప్రాజెక్ట్: 10,000 హెక్టార్ల కన్నా ఎక్కువ సాగు భూమికి నీటి పారుదల వసతిని కల్పించే ప్రాజెక్టు.

మధ్య తరహా ప్రాజెక్ట్: 2,000- 10,000 హెక్టార్ల మధ్య సాగు భూమికి నీటి పారుదల వసతిని కల్పించే ప్రాజెక్టు.

చిన్న తరహా ప్రాజెక్ట్: 2,000 హెక్టార్ల కంటే తక్కువ సాగు భూమికి నీటి పారుదల వసతిని కల్పించే ప్రాజెక్టు.



ప్రధాన ప్రాజెక్టులు

దామోదర్ వ్యాలీ

- దామోదర్, దాని ఉప నదులపై నిర్మించిన నాలుగు ప్రాజెక్టులను కలిపి దామోదర్ వ్యాలీ ప్రాజెక్టు అని పిలుస్తారు.
- 1948లో దేశంలో మొట్ట మొదటి వరద నియంత్రణ కార్యక్రమంగా దామోదర్ వ్యాలీ ప్రాజెక్టును ప్రారంభించారు.
- ఈ ప్రాజెక్టు అమలు కోసం 'దామోదర్ వ్యాలీ కార్పొరేషన్'(డీవీసీ) అనే సంస్థను ఏర్పాటు చేశారు.
- డీవీసీకి సహాయపడిన సంస్థ టెన్నిస్ వ్యాలీ అథారిటీ
- డీవీసీలో భాగంగా ఊర్దిన్ ప్రతిపాదించిన డ్యామ్‌ల సంఖ్య: 7
- ఇప్పటి వరకు నాలుగు డ్యాములను నిర్మించారు. అవి.. కోనార్(కోనార్ నదిపై), పాంచెట్(దామోదర్ నదిపై), తిలయ(బారకార్ నదిపై), మైదాన్(బారకార్ నదిపై).
- ఊర్థిన్ అమెరికాలోని టెన్నిస్ వ్యాలీ అథారిటీ ఛైర్మన్
- దామోదర్ వ్యాలీ ప్రాజెక్టు అమెరికాలోని టెన్నిస్ వ్యాలీ నమూనాను పోలి ఉంటుంది.

నాగార్జున సాగర్ ప్రాజెక్ట్

- **నిర్మాణం ప్రారంభం అయిన సంవత్సరం:** 1955 డిసెంబరు 10
- **నిర్మాణం పూర్తి:** 1967 ఆగస్టు 4. ఇందిరాగాంధీ ప్రారంభించారు.
- ఈ ప్రాజెక్టును కృష్ణా నదిపై నందికొండ గ్రామం(నల్లగొండ) వద్ద నిర్మించారు.
- **దీని నిర్మాణ ఇంజనీర్:** కానూరి లక్ష్మణ రావు
- డ్యామ్ నిర్మాణానికి కేంద్రం ఖోస్లా కమిటీని ఏర్పాటు చేసింది.
- ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలు అని ఈ ప్రాజెక్టు నిర్మాణం సందర్భంగా నెహ్రూ వ్యాఖ్యానించారు.
- నాగార్జున సాగర్ ప్రాజెక్టు ప్రపంచంలోనే అతి ఎత్తయిన రాతి ఆనకట్ట. **ఎత్తు:** 124.7 మీటర్లు, **పొడవు:** 1550 మీ. నీటి నిల్వ **సామర్థ్యం:** 408 టీఎంసీలు. స్థాపిత విద్యుత్ **సామర్థ్యం:** 826 మెగా వాట్లు.
- ఈ ప్రాజెక్టుకు రెండు కాలువలు ఉన్నాయి. ఒకటి జవహర్ లాల్ నెహ్రూ కాలువ(కుడి కాలువ)- దీని పొడవు 203 కి.మీ. ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు, గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాలకు సాగునీటి వసతులను కల్పిస్తుంది. రెండోది లాల్ బహదూర్ శాస్త్రి కాలువ(ఎడమ కాలువ)- దీని పొడవు 296 కి.మీ. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా, ఏలూరు, జిల్లాలకు; తెలంగాణలోని నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాకు సాగునీటి వసతులను కల్పిస్తుంది.

ఇందిరా గాంధీ కాలువ

- దీనిని రాజస్థాన్ కాలువ అని కూడా పిలుస్తారు. దీనిలో సట్లెజ్, రావి, బియాస్ మూడు నదుల నీరు ప్రవహిస్తుంది. దీని ప్రధాన కాలువ హరికే బ్యారేజ్ నుంచి ప్రారంభమవుతుంది. ఉప కాలువలు బియాస్, రావి నదుల నుంచి ప్రారంభమవుతాయి. దీని ప్రధాన కాలువ పొడవు: 650 కి.మీ. ఇది మూడు రాష్ట్రాలకు నీటి వసతులను కల్పిస్తుంది. పంజాబ్‌లో 167 కి.మీ., హర్యానాలో 38. కి.మీ., రాజస్థాన్‌లో 445 కి.మీ. ప్రవహిస్తుంది. రాజస్థాన్‌లోని థార్ ఎడారిలోని గంగానగర్, బికనీర్, జైసల్మేర్, జోథ్‌పూర్ వరకు నీటి వసతులను కల్పిస్తుంది. ఇది దేశంలోనే అతి పొడవైన వ్యవసాయ కాలువ.

నోట్: ప్రపంచంలో అత్యంత పొడవైన వ్యవసాయ కాలువ: ద గ్రాండ్ కెనాల్ - చైనా - 1776 కి.మీ. (బీజింగ్ నుంచి హాంగ్ జంగ్ నగరం వరకు కలదు).



వి.వెంకటరెడ్డి,
సీనియర్ ఫ్యాకల్టీ

బయోటెక్నాలజీలో ప్రవేశానికి జీఏటీ-బీ/బీఈటీ

బయోటెక్నాలజీ విభాగాల్లో పీజీ ప్రవేశాలకు ఉద్దేశించిన గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్-బయోటెక్నాలజీ (జీఏటీ-బీ) 2024, అలాగే జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌ల కోసం నిర్దేశించిన బయోటెక్నాలజీ ఎలిజిబిలిటీ టెస్ట్(బీఈటీ) 2024లకు నోటిఫికేషన్ వెలువడింది. వీటిని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహిస్తోంది. ఈ పరీక్షల సిలబస్, పార్టిసిపేటింగ్ యూనివర్సిటీలు, సీట్ల వివరాలకోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

జీఏటీ-బీ

ఈ ఎగ్జామ్ ద్వారా పార్టిసిపేటింగ్ ఇన్‌స్టిట్యూషన్స్/యూనివర్సిటీల్లో అడ్మిషన్స్ పొందే అవకాశం లభిస్తుంది. ఎమ్మెస్సీ(బయోటెక్నాలజీ/అగ్రికల్చరల్ బయోటెక్నాలజీ/సంబంధిత విభాగాలు), ఎంటెక్(బయోటెక్నాలజీ/ సంబంధిత విభాగాలు), ఎంవీఎస్సీ(యానిమల్ బయోటెక్నాలజీ) కోర్సులు అందుబాటులో ఉన్నాయి. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో ఎమ్మెస్సీ(బయోటెక్నాలజీ) 30 సీట్లు, ఉస్మానియా యూనివర్సిటీలో ఎమ్మెస్సీ(మాలిక్యులర్ అండ్ హ్యూమన్ జెనెటిక్స్) 10 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 55 శాతం మార్కులతో బీఎస్సీ(ఫిజికల్ సైన్సెస్/బయలాజికల్ సైన్సెస్/అగ్రికల్చర్/వెటర్నరీ/ఫిషరీస్/ఫార్మసీ/ఇంజనీరింగ్/లైఫ్ సైన్సెస్/బయోటెక్నాలజీ/జెనెటిక్స్/మైక్రోబయాలజీ/బయోఇన్ఫర్మాటిక్స్/ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్)/ఎంబీబీఎస్/బీడీఎస్/బీవీఎస్సీ/బీఏఎంఎస్/బీహెచ్ఎంఎస్/బీపీటీ/బీఈ/బీటెక్ (బయోటెక్నాలజీ/కెమికల్ ఇంజనీరింగ్/ఫుడ్ ఇంజనీరింగ్/ఫుడ్ ప్రాసెస్ టెక్నాలజీ/డెయిరీ టెక్నాలజీ/జెనెటిక్ ఇంజనీరింగ్)/బీఎఫ్ఎస్సీ/అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్(సైన్స్/అప్లయిడ్ సైన్స్)ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.


గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్(జీఏటీ-బీ) వివరాలు: దీనిని సీబీటీ విధానంలో నిర్వహిస్తారు. అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే అడుగుతారు. ఇందులో రెండు సెక్షన్‌లు ఉంటాయి. మొదటి సెక్షన్‌లో ఫిజిక్స్ కెమిస్ట్రీ మేథమెటిక్స్, బయాలజీ సబ్జెక్టుల నుంచి ఇంటర్ స్థాయిలో 60 ప్రశ్నలు ఇస్తారు. అన్నింటికీ సమాధానాలు గుర్తించాలి. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే అర మార్కు కోత విధిస్తారు రెండో సెక్షన్‌లో బేసిక్ బయాలజీ, లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ, సంబంధిత విభాగాలనుంచి డిగ్రీ స్థాయిలో 100 ప్రశ్నలు అడుగుతారు. వీటిలో 60 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ప్రశ్నకు మూడు మార్కులు ఉంటాయి. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. మొత్తం మార్కులు 240. పరీక్ష సమయం మూడు గంటలు.

బీఈటీ

ఈ ఎగ్జామ్‌లో సాధించిన మెరిట్ ఆధారంగా రెండు కేటగిరీల్లో మెరిట్ లిస్ట్‌లను రూపొందిస్తారు. మొదటి కేటగిరీ అభ్యర్థులకు డీబీటీ జేఆర్ఎఫ్ లభిస్తుంది. వీరు దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ యూనివర్సిటీల్లో పీహెచ్‌డీకి రిజిస్టర్ చేసుకోవచ్చు. ఫెలోషిప్ లెటర్ అందుకొన్న రెండేళ్లలోపు వీరు పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో చేరాల్సి ఉంటుంది.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో బీఈ/బీటెక్/ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతోపాటు బయోటెక్నాలజీ/లైఫ్ సైన్సెస్/బయోమెడికల్/బయో ఇన్ఫర్మాటిక్స్/బయోకెమిస్ట్రీ/బయోఫిజిక్స్/బోటనీ/కెమిస్ట్రీ/కంప్యూటేషనల్ బయాలజీ/జెనెటిక్స్/మైక్రో బయాలజీ/ జువాలజీ స్పెషలైజేషన్‌లతో ఎమ్మెస్సీ/ఎంటెక్/ఎంవీఎస్సీ/ఎం.ఫార్మసీ/ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ పూర్తిచేసి ఉండాలి.

బయోటెక్నాలజీ ఎలిజిబిలిటీ టెస్ట్(బీఈటీ) వివరాలు: ఇందులో కూడా రెండు సెక్షన్‌లు ఉంటాయి. అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. మొదటి సెక్షన్‌లో జనరల్ సైన్స్, మేథమెటిక్స్, కెమిస్ట్రీ, జనరల్ ఆప్టిట్యూడ్, అనలిటికల్ క్వాంటిటేటివ్ ఎబిలిటీ, జనరల్ బయోటెక్నాలజీ అంశాల నుంచి 50 ప్రశ్నలు అడుగుతారు. అన్నింటికీ సమాధానాలు గుర్తించాలి. రెండో సెక్షన్‌లో బయోటెక్నాలజీ అంశాల నుంచి 150 ప్రశ్నలు ఇస్తారు. వీటిలో 50 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. రెండు సెక్షన్లలో ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు నిర్దేశించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. మొత్తం మార్కులు 300. పరీక్ష సమయం మూడు గంటలు.



- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.600
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 6
- **వెబ్‌సైట్:** www.nta.ac.in

మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి
నీట్ యూజీ

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)- అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి ఉద్దేశించిన నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రెన్స్ టెస్ట్(నీట్) యూజీ 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంగ్లీష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/బయోటెక్నాలజీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి.

నీట్ యూజీ వివరాలు: ఈ పరీక్షని ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ సహా వేరువేరు భాషల్లో నిర్వహిస్తారు. వీటిలో ఒకదాన్ని అభ్యర్థులు ఎంచుకోవాల్సి ఉంటుంది. ఈ ఎగ్జామ్‌లో మొత్తం 200 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 50 ప్రశ్నలు అడుగుతారు. ప్రతి సబ్జెక్టులో రెండు సెక్షన్‌లు ఉంటాయి. మొదటి సెక్షన్‌లో 35 ప్రశ్నలు ఇస్తారు. వీటన్నింటికి సమాధానాలు గుర్తించాలి. రెండో సెక్షన్‌లో 15 ప్రశ్నలు ఇస్తారు. వీటిలో ఏవైనా పదింటికి సమాధానాలు గుర్తించాలి. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు నిర్దేశించారు. మొత్తం మార్కులు 720. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం మూడు గంటల ఇరవై నిమిషాలు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1700; ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1600; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **చివరి తేదీ:** మార్చి 9
- **నీట్ యూజీ 2024 తేదీ:** మే 5
- **వెబ్‌సైట్:** exams.nta.ac.in/NEET

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/XUxbz3gలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

మిథున్ చక్రవర్తికి గుండెపోటు



ప్రముఖ బాలీవుడ్ నటుడు మిథున్ చక్రవర్తి తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. శనివారం ఉదయం ఆయనకు గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే కోల్‌కత్తాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. వైద్యులు ఆయనకు ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. ఆయనకు రెండేళ్ల క్రితం కిడ్నీల్లో సమస్య తలెత్తడంతో ఆపరేషన్ చేశారు. మిథున్ త్వరగా కోలుకోవాలని అభిమానులు ప్రార్థిస్తున్నారు. ఇటీవలే కేంద్ర ప్రభుత్వం మిథున్ చక్రవర్తికి పద్మభూషణ్ పురస్కారాన్ని ప్రకటించింది. పలు బాలీవుడ్, బెంగాలీ చిత్రాల్లో నటించి హీరోగా స్టార్‌డమ్ అందుకున్నారు. వివాదాస్పద చిత్రం 'కశ్మీర్‌ఫైల్స్'లో మిథున్ చక్రవర్తి తనదైన శైలిలో నటించి మెప్పించారు.

ప్రేక్షకులకు గుర్తుండిపోయే చౌర్యపాఠం



రవితేజ కథానాయకుడిగా నటించిన 'ధమాకా' చిత్రంతో దర్శకుడిగా నక్కిన త్రినాథరావు పేరు తెచ్చుకున్నారు. ఇప్పుడు ఆయన నిర్మాతగా మారి 'చౌర్య పాఠం' అనే చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇంద్ర రామ్ కథానాయకుడు. పాయల్ రాధాకృష్ణ హీరోయిన్. నిఖిల్ గొల్లమారి దర్శకుడు. దర్శకుడు కార్తిక్ ఘట్టమనేని ఈ చిత్రానికి కథ అందించారు. ఈ సినిమా ఫస్ట్‌లుక్, టీజర్‌ని లాంచ్ చేసి ప్రచార కార్యక్రమాలు ప్రారంభించారు. గ్రామంలో దోపిడీకి హీరో తన ముఠాను సమాయత్తం చేయడంతో మొదలైన టీజర్ ఆద్యంతం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా త్రినాథరావు మాట్లాడుతూ 'నక్కిన నెరేటివ్ బేనర్స్ ఈ రోజు ప్రారంభమైంది. దీనికి ప్రేక్షకులు ఊపిరి, భవిష్యత్‌ను ఇవ్వాలి. 'చౌర్య పాఠం'లో పాత్రలు ప్రేక్షకులకు గుర్తుండిపోతాయి' అన్నారు. ఈ సినిమా కోసం నాగేంద్ర 14 సెట్స్ వేశారని ఇంద్రరామ్ తెలిపారు. త్రినాథరావు ఎక్కడా రాజీపడకుండా సినిమాను నిర్మించారని దర్శకుడు చెప్పారు.

క్రమశిక్షణ, నిజాయితీ ఆయన్ని ఉన్నత శిఖరాలకు చేర్చాయి

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



'మురళీమోహన్‌లో నాకు నచ్చింది క్రమశిక్షణ, నిజాయితీ. జయాపజయాలను ఒక్కటిగా తీసుకోవడం ఆయన్ను ఉన్నత శిఖరాలకు చేర్చింది. యువత ఆయన్నుంచి ఇవన్నీ నేర్చుకోవాలి. వారు మంచి సందేశం ఉన్న సినిమాలు భవిష్యత్తులో మరిన్ని చేయాలని కోరుకుంటున్నాను' అన్నారు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు. 'సకుటుంబ, సపరివార సమేతంగా చూసేలా సినిమాలు రాయండి, తీయండి. కుటుంబాలను, సంస్కృతి, సంప్రదాయాలను దృష్టిలో పెట్టుకుని సినిమాలు నిర్మించండి' అని ఆయన కోరారు. 'పీవీ నరసింహారావు గారి ముందు చూపు వల్లనే నేడు దేశం ఇంత ముందుకు సాగింది. ఆయనకు భారతరత్న రావడం చాలా ఆనందకరమైన విషయం. చంద్రబాబు సంస్కరణల వల్లనే నేడు హైదరాబాద్ టెక్నాలజీ, ఫైనాన్షియల్, ఇండస్ట్రీ హబ్‌గా మారింది' అని పేర్కొన్నారు వెంకయ్యనాయుడు. నటుడు, నిర్మాత మురళీమోహన్ 50ఏళ్ల సినీ జీవితం పూర్తిచేసుకున్న సందర్భంగా శనివారం శిల్పకళా వేదికలో గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మరో ముఖ్య అతిథి చంద్రబాబు మాట్లాడుతూ 'ఏ పనైనా మనసుపెట్టి చేసే వ్యక్తి మురళీమోహన్. సినిమాల నిర్మాణంలో, రియల్‌ఎస్టేట్ రంగంలో ఆయన అద్భుతంగా రాణించారు. ఎంతో మందిని సొంత ఖర్చులతో చదివించి డాక్టర్లు, ఇంజనీర్లుగా తీర్చి దిద్దారు. ఇక వెంకయ్యనాయుడు గారి విషయానికి వస్తే ఆయన రాజకీయాల్లో సిన్సియారిటీకి మారుపేరుగా నిలిచారు. ఆయనకు పద్మ విభూషణ్, పీవీ నరసింహారావు గారికి భారతరత్న వంటి అత్యున్నత పురస్కారాలు రావడం మనందరికీ గర్వకారణం' అన్నారు.

ఎన్టీఆర్‌లోని అనేక మంచి లక్షణాలను ఆదర్శంగా తీసుకుని మురళీమోహన్ ఎంతో ఎత్తుకు ఎదిగారని తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు . చివరిగా మురళీమోహన్ మాట్లాడుతూ.. 'నేను ఇవాళ ఈ స్థాయిలో మీ ముందు ఉన్నానంటే అట్లూరి పూర్ణచంద్రరావు గారు పెట్టిన భిక్షే. 1973లో ఆయన నాకు హీరోగా అవకాశం ఇస్తే, ఇండస్ట్రీలో నన్ను నిలబెట్టారు దాసరి గారు. వీరిద్దరినీ నా జీవితంలో మర్చిపోలేను' అన్నారు. 50 ఏళ్ల క్రితం తనకు తొలి అవకాశం ఇచ్చిన అట్లూరి పూర్ణచంద్రరావుకు ఈ సందర్భంగా మురళీమోహన్ ఒక కారును బహుమతిగా అందజేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో నాటి హీరోయిన్లు ప్రభ, జయచిత్ర, కవిత, సీనియర్ నటుడు కోట శ్రీనివాసరావు, దర్శకుడు రాజమౌళి, నిర్మాతలు అశ్వినీదత్, సురేశ్‌బాబు, సంగీత దర్శకుడు కీరవాణి, నటుడు కృష్ణంరాజు సతీమణి శ్యామల, పార్లమెంట్ సభ్యులు రఘురామ కృష్ణంరాజు, సుజనా చౌదరీ, నటుడు ప్రదీప్, కొల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

నవ్య 'దృశ్యం' పేజీలోని మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/fR1qtvv లో చదవండి.

ప్రజల్లో విశ్వాసం కోల్పోయిన జగన్


తుళ్లూరు రైతు ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న రైతులు, మహిళలు

- 1516వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్ళూరు, ఫిబ్రవరి 10: ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయిన నాయకుడు సీఎం జగన్‌రెడ్డి అని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. మూడు ముక్కల ఆటతో అభివృద్ధికి ఆటంకం కలిగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు, నిరసన దీక్షలు శనివారం నాటికి 1516వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ, సీఎం జగన్‌రెడ్డి కక్ష సాధింపు చర్యలు నిలుపుదల చేయాలన్నారు. విశాఖ వెళతానని పదే పదే చెప్పే జగన్‌రెడ్డి ముందు అమరావతిని అభివృద్ధి చేసి రాష్ట్రంలో ఏ మూలకైనా వెళ్లవచ్చని రైతులన్నారు. మూడు రాజధానులనేది జగన్ రెడ్డి సొంత ప్రయోజనాల కోసమన్నారు. హైకోర్టు తీర్పును అమలు చేయమని చెపుతున్నా పెడచెవిన పెడుతున్నారన్నారు. రేపు కోర్టు ధిక్కార కేసును సీఎం జగన్‌రెడ్డి ఎదుర్కోవాలన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి, అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలతో పాటు తాడికొండ, మంగళగిరి నియోజకవర్గాల్లో రైతుల ఆందోళనలు కొనసాగాయి.

టీడీపీ, జనసేన.. గెలుపు ఖాయం

- టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు
- వెన్నాదేవిలో ఎన్టీఆర్ విగ్రహం ఆవిష్కరణ
- హాజరైన యరపతినేని, కన్నా, చదలవాడ తదితరులు


వెన్నాదేవిలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన కన్నా, యరపతినేని, జీవీ, చదలవాడ తదితరులు, సభలో మాట్లాడుతున్న కన్నా

సత్తెనపల్లి, ఫిబ్రవరి 10: రాష్ట్రంలో టీడీపీ, జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావటం ఖాయమని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు అన్నారు. సత్తెనపల్లి మండలం వెన్నాదేవిలో టీడీపీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని జీవీ ఆంజనేయులు, కన్నా లక్ష్మీనారాయణ, గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, నరసరావుపేట ఇన్‌చార్జ్ చదలవాడ అరవిందబాబులు ఆవిష్కరించారు. పార్టీ పతాకాన్ని కన్నా లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. అనంతరం కన్నా అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో జీవీ మాట్లాడుతూ అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో దోపిడీకి, అరాచకానికి పాల్పడిందన్నారు. గోదావరి, పెన్నానది అనుసంధానం పనులను ప్రభుత్వం నిలిపి వేసిందన్నారు. దీనివల్ల ప్రకాశం పల్నాడు జిల్లాలో రైతాంగానికి తీవ్ర నష్టం జరిగిందన్నారు. నీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు దోచుకోవటం తప్ప రైతాంగానికి చేసిన మేలు ఏమి లేదన్నారు. రానున్న ఎన్నికల్లో పల్నాడు జిల్లాలో ఏడు ఎమ్మెల్యే, ఒక ఎంపీ స్థానాన్ని గెలుచు కోవటం ఖాయమన్నారు. యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ అహంకారంతో చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌లపై విమర్శలు చేసిన వైసీపీ నేతలు రెండు నెలల తరువాత భారీ మూల్యం చెల్లించు కోక తప్పదన్నారు. సైకో పాలనలో రాష్ట్రం 20 సంవత్సరాలు వెనక్కి వెళ్ళిందన్నారు. రాష్ట్రాన్ని రాజధాని లేని రాష్ట్రంగా తయారు చేశారన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో ఆంబోతు అంబటి రాంబాబును సాగనంపాలన్నారు. జనసేన, టీడీపీ కలయికతో రాష్ట్రంలో 155 స్థానాలతో ప్రభుత్వం ఏర్పాటు కావటం ఖాయమన్నారు. సత్తెనపల్లి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తెలుగుజాతికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించు కోవటం చాలా సంతోషం అన్నారు. ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా చేసి రాష్ట్రంలో అన్ని వర్గాలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించారన్నారు. విగ్రహాన్ని ఏర్పాటు చేసిన గ్రామ కమిటీ సభ్యులను కన్నా, యరపతినేని, జీవీ ఆంజనేయులు, చదలవాడ అరవిందబాబు అభినందించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ఐదుగురు యువకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి కన్నా పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బహిరంగ సభలో సింహాద్రి యాదవ్, ఆళ్ళ అమరేశ్వరరావు, భీమినేని వందనాదేవి, గొర్రెపాటి సుశీల, నార్నెపాటి వెంకటరావు, పచ్చ సుధీర్, ముంద్రా శ్రీనివాసరావు, వెనిగళ్ళ వేదాద్రి, మల్లేశ్వరి, వేణు, భార్గవ్, పల్లపాటి పెద్దిరాజు, బత్తుల నాగేశ్వరరావు, రావిపాటి మధుబాబు, ఆళ్ళ సాంబయ్య, తోటకూర సాంబశివరావు, పున్నారావు, సత్తెనపల్లి మండల, నియోజక వర్గానికి చెందిన పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ హోంమంత్రి సుచరితకు నిరసన సెగ


సుచరిత కాన్వాయ్‌ను చుట్టుముట్టిన తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్ నేతలు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 10: రాష్ట్ర మాజీ హోంమంత్రి మేకతోటి సుచరితకు గుంటూరు జిల్లా మంగళగిరిలో నిరసన సెగ తగిలింది. దగా డీఎస్సీ వద్దు.. మెగా డీఎస్సీ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్, నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం మంగళగిరి అంబేద్కర్ సెంటరులో నిరసన, మానవహారం జరుగుతున్న సమయంలో సుచరిత కాన్వాయ్ అటుగా వచ్చింది. దీంతో నిరసన తెలుపుతున్న యువకులు కాన్వాయ్‌ను చుట్టుముట్టి ప్లకార్డులను ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. వారిని నిలువరించే క్రమంలో పోలీసులకు, యువతకు మధ్య స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. కారును ముందుకు పోనివ్వడంతో ఓ పోలీసు కిందపడిపోయారు. కాన్వాయ్‌లోని కార్లు వేగంగా వెళ్లే క్రమంలో ఓ కారు మరో కారును ఢీకొట్టింది. ఎట్టకేలకు పోలీసులు యువతను పక్కకుతప్పించి కాన్వాయ్‌కు లైన్‌క్లియర్ చేసి ముందుకు పంపించడంతో ఊపిరి పీల్చుకున్నారు.

జగన్ ప్రభుత్వం రైతులను నిలువునా ముంచింది

- మాజీ మంత్రి నక్కా ఆనందబాబు


రైతులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న నక్కా ఆనందబాబు

చుండూరు, ఫిబ్రవరి 10: రైతుల కష్టాల ముందు వారికి ఎంత చేసినా తక్కువే.. అలాంటిది జగన్ ప్రభుత్వం నమ్ముకున్న రైతులను నిలువునా ముంచిందని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు ఆరోపించారు. శనివారం సాయంత్రం మోదుకూరులో జరిగిన రైతు, పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ పంట రుణాలపై సున్నా వడ్డీ, పంటల బీమా, తుఫాన్ నష్టానికి ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు భరోసా ఇలా రైతు పథకాల క్రింద వేల కోట్ల రూపాయల బకాయిలు అందించాల్సి ఉందన్నారు. ప్రస్తుతం జగన్ వాటి ఊసే ఎత్తడం లేదని తెలిపారు. గతంలో తెలుగుదేశం పాలనలో లక్ష రూపాయల లోపు పంట రుణాలకు వడ్డీ కట్టే అవసరమే ఉండేది కాదు. జగన్ వచ్చిన తరువాత అణా పైసలతో సహా పంట రుణాలపై అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారన్నారు. కేంద్రం అందించిన మీచౌంగ్ తుఫాన్ రూ.493కోట్లు నష్టపరిహారాన్ని కూడా పంపిణీ చేయలేదన్నారు. అదేవిధంగా 2021నుంచి 2023వరకు ఖరీఫ్, రబీ కాలాలకు సంబంధించిన రైతులకు వడ్డీ రాయితీని కూడా ఇంతవరకు జమ కాలేదు. గత నాలుగున్నర సంవత్సరాల్లో పంట కాల్వల మరమ్మత్తులకు ఎలాంటి నిధులు కేటాయించలేదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు గూదేటి ఎల్లారెడ్డి, కుర్రి వెంకటరెడ్డి, ఆళ్ళ సుబ్బారెడ్డి, కొల్లి శ్రీనివాసరెడ్డి, కంఠంనేని రాహుల్, రాఘవరెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

మంగళగిరి, ఫిబ్రవరి 10: దేశంలోని 18 రాష్ట్రాలలో ఎస్సీలుగా వున్న రజకులను ఏపీలో కూడా ఎస్సీలుగా గుర్తించాలని నేషనల్ ధోబీ మహాసంఘ్ జాతీయ అధ్యక్షుడు అన్నవరపు నాగమల్లేశ్వరరావు డిమాండ్ చేశారు. తిరుమల శ్రీవారి పాదాల నుంచి బెజవాడ కనకదుర్గమ్మ ఆలయం వరకు ఆయన ప్రారంభించిన పాదయాత్ర శనివారం మంగళగిరి పట్టణానికి చేరుకుంది. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్ ఆధ్వర్యంలో చినకాకాని నేతన్న సర్కిల్ వద్ద పాదయాత్రకు ఘనస్వాగతం పలికారు. ఎస్సీ, బీసీ సంఘాల నాయకులు పాల్గొని పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ రజక సంఘం అధ్యక్షుడు పేరూరి సత్యనారాయణ, వివిధ సంఘాల ప్రతినిధులు కట్టెపోగు ఉదయభాస్కర్, కొల్లూరు హనుమంతరావు, వుడతా శ్రీనివాసరావు, కాగితాల స్వాతి, తిరువీధుల కిరణ్, మంద్రు సత్యనారాయణ, దామర్ల నారాయణ, గొడ్డెలగల జయలక్ష్మీ, కొమ్మాకుల విజయభాస్కర్, కామరాజుగడ్డ సోమేశ్వరరావు, చాటపర్తి పోసిబాబు, వేముల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా కొండవీడు ఉత్సవాలు


కొండవీడులో బెలూన్‌లు ఎగుర వేస్తున్న జాయింట్ కలెక్టర్

యడ్లపాడు, ఫిబ్రవరి 10: మండలంలోని కొండవీడు ఫెస్ట్ - 2024 ఉత్సవాలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులతో కలసి జాయింట్ కలెక్టర్ ఏ శ్యామ్‌ప్రసాదు, అసిస్టెంట్ కలెక్టర్ కల్పశ్రీ, డీఎఫ్‌వో ఎస్.రామచంద్రరరావులు బెలూన్‌లు ఎగర వేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి తదితరులు ఉత్సవాల్లో పాల్గొన్నారు. కాగా కొండవీడు కోట పర్యాటక అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న కొండవీడు ఫెస్ట్ హెలిరైడ్‌క టిక్కెట్ ధర పెద్ద వారికి రూ.3,800, పిల్లలకు రూ.3,500గా నిర్ణయించినట్లు కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కొండవీడు ఫెస్ట్‌ను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సీఏ ఫౌండేషన్ ఫలితాల్లో మాస్టర్ మైండ్స్ విద్యార్థుల ప్రతిభ


హిమబిందు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి10: ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన సీఏ ఫౌండేషన్ ఫలితాల్లో మాస్టర్ మైండ్స్ విద్యార్థులు అధికసంఖ్యలో ఉత్తీర్ణత సాధించారని మాస్టర్ మైండ్స్ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ తెలిపారు. మాస్టర్ మైండ్స్ విద్యార్థిని ఎ.హిమబిందు(హల్ టికెట్ నెం: 887474) 400 మార్కులకు గాను 347 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు మోహన్ తెలిపారు. అలాగే తమ విద్యాసంస్థలో 400కు గాను 300, ఆపైన సాధించిన 36 మంది విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు. అలాగే దాదాపు 1000 మంది మాస్టర్‌మైండ్స్ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని వివరించారు. మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థ అత్యున్నత బోధనా విధానం, క్రమశిక్షణ విద్యార్థుల విజయానికి కారణమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఏ ఫౌండేషన్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మోహన్ అభినందించారు.

భవనం పైనుంచి దూకి విద్యార్థి బలవన్మరణం


విద్యార్థి వంశీ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రమేష్

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 10: ఎంటీఎంసీ పరిధిలోని ఓ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థి శనివారం హాస్టల్ భవనంపై నుంచి దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన బి.వంశీ సాయికృష్ణ సదరు యూనివర్సిటీలో బీటెక్ 3వ సంవత్సరం చదువుతున్నాడు. మధ్యాహ్న సమయంలో తాను ఉంటున్న హాస్టల్ భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడో వివరాలు తెలియరాలేదు. తాడేపల్లి సీఐ మధుసూదనరావు, ఎస్ఐ రమేష్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని జరిగిన ఘటనపై విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, విద్యార్థి తండ్రి పుల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పీవీకి భారతరత్న.. అభినందనీయం

సత్తెనపల్లి, ఫిబ్రవరి 10: మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించటం అభినందనీయమని సత్తెనపల్లి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పీవీ నరసింహారావు సంస్కరణల రూపశిల్పి అన్నారు. పలు హోదాల్లో దేశానికి అసమాన సేవలు అందించారన్నారు. అనేక సంవత్సరాల పాటు లోక్‌సభ, శాసనసభ్యునిగా ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. దేశ ఆర్థికాభి వృద్ధిలో దూరదృష్టితో కూడిన ఆయన నాయకత్వం అతి కీలకపాత్ర పోషించిందన్నారు. దేశ శ్రేయస్సుకు, అభివృద్ధికి బలమైన పునాది వేసిందన్నారు. ప్రధానిగా బాధ్యతలు నిర్వహించిన సమయంలో ఆయన అందించిన సేవలు మరువ లేనివని ఆయన పేర్కొన్నారు. పీవీకి భారతరత్న ప్రకటించడంపై ప్రధాని నరేంద్రమోదీకి కూడా కన్నా అభినందనలు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	136, 147,156
చికెన్ విత్ స్కిన్	260.00
చికెన్ స్కిన్ లెస్	270.00

ప్రధాన రహదారిపై చెక్కుల పంపిణీ

- బందోబస్తు నిర్వహించిన పోలీసులు


స్థానిక రథం సెంటర్‌లో రోడ్డుపై టెంట్లు వేయడంతో ఇబ్బందులు పడిన ద్విచక్రవాహన చోదకులు, ప్రజలు

భట్టిప్రోలు, ఫిబ్రవరి 10: అడుగడుగునా వైసీపీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నప్పటికీ అధికారులు, పోలీసులు చోద్యం చూస్తున్నారు. డ్వాక్రా సంఘాలకు ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం స్థానిక రథం సెంటర్‌లో శనివారం నిర్వహించారు. డ్వాక్రా సంఘాలకు చెక్కుల పంపిణీ కార్యక్రమం భట్టిప్రోలు గ్రామం నడిబొడ్డున మెయిన్‌రోడ్డుపై నిర్వహించారు. ద్విచక్రవాహన చోదకులు, పాదచారులు, వ్యాపారవర్గాలు, స్థానిక గృహాల్లో నివాసం ఉండే ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ప్రజాప్రతినిధిగా ఎన్నిక కాకుండానే అధికారిక కార్యక్రమాల్లో నియోజకవర్గ సమన్వయకర్త అశోక్‌బాబు ఎలా పాల్గొంటారని పలువురు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. చెక్కుల పంపిణీ కార్యక్రమానికి నాలుగు రోడ్లలో పోలీసులు దగ్గర ఉండి మరీ ట్రాఫిక్‌ను మళ్ళించడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పోలీసు వాహనాలతో బందోబస్తుగా సభాస్థలికి సమన్వయకర్త అశోక్‌బాబు కాన్వాయ్‌ను తీసుకురావడంపై రాజకీయ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అధికార దుర్వినియోగం జరుగుతున్నప్పటికీ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించడంపై పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కమ్మజన సేవాసమితికి రూ.5 లక్షల విరాళం


గోరంట్ల పున్నయ్యచౌదరికి చెక్కును అందజేస్తున్న డాక్టర్ బి.శారదాదేవి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 10: జేకేసీ రోడ్డులోని కమ్మజన సేవాసమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న భవన సముదాయంలో ఒకగది నిర్మాణానికి అయ్యే ఖర్చు మొత్తం రూ.5 లక్షలను విరాళంగా నగరానికి చెందిన డాక్టర్ బి.శారదాదేవి ప్రకటించారు. ఈ సందర్భంగా శనివారం కమ్మజన సేవా సమితి కోశాధికారి గోరంట్ల పున్నయ్య చౌదరికి ఆమె చెక్కును అందజేశారు. అనంతరం శారదాదేవి మాట్లాడుతూ తమ తల్లిదండ్రులు భైరవనేని వెంకటేశ్వరరావు, నాగేశ్వరమ్మల గౌరవార్థం ఈ విరాళాన్ని అందజేసినట్లు వివరించారు. దాదాపు 1,600 మంది బాలికలకు వసతి కల్పిస్తున్న సేవా సమితి సేవలు అభినందనీయమన్నారు. సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ కేజేఎస్ఎస్ 80జీ, 12ఏఏ, సీఎస్ఎస్ సర్టిఫికెట్లు కలిగి ఉన్నాయని, దాతలు ఇచ్చిన విరాళాలను పారదర్శకంగా వినియోగిస్తామని వివరించారు. త్వరలోనే భవన నిర్మాణ పనులను ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

బాపట్లలో ఉమ్మడి అభ్యర్థి ఎవరైనా గెలిపిస్తాం

- రఘుపతిని ఓడిద్దాం.. బాపట్లను కాపాడుదాం
- మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకుడు అన్నం సతీష్ ప్రభాకర్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న అన్నం సతీష్ ప్రభాకర్

బాపట్ల,ఫిబ్రవరి 10 : బాపట్లలో బీజేపీ, జనసేన, టీడీపీ కలిసి పోటీ చేసే అభ్యర్థి ఎవరైనా గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నామని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకుడు అన్నం సతీష్ ప్రభాకర్ అన్నారు. అవినీతి, అక్రమాలకు అడ్డాగా మారిన ఎమ్మెల్యే కోన రఘుపతిని రాబోయే సార్వత్రిక ఎన్నికలలో ఓడించి బాపట్లను కాపాడుదామని ఆయన పిలుపునిచ్చారు. పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అన్నం సతీష్ మాట్లాడుతూ అధికారం ఉంది ఏదైనా చేయవచ్చు.. ఏ విధంగానైనా దోచుకోవచ్చు, నా ద్వారానే ఏదైనా జరగాలి అనే రీతిలో ఎమ్మెల్యే వ్యవహరిస్తున్నారన్నారు. అందిన కాడికి దోచుకుంటూ ముందుకెళుతున్నారని విమర్శించారు. మరలా బాపట్లలో కోన రఘుపతి పోటీ చేస్తే శక్తివంచన లేకుండా పని చేసి ఓడిస్తామన్నారు. దుర్మార్గుడిని ఎమ్మెల్యేగా గెలిపించరాదని ప్రజలందరిని కోరుతానన్నారు. ముసుగులో ఉన్న రఘుపతి 5 సంవత్సరాల పాపాలు, దుర్మార్గాలు అన్ని బయటకు తెస్తామన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా రఘుపతి దోపిడీలు బయట పెడతామన్నారు. అధికారం ఉందని ప్రజలు ప్రశ్నించటం లేదన్నారు. ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. బాపట్లలో జరుగుతున్న దుర్మార్గం, దారుణం స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎన్నడూ లేదన్నారు. జనం ఇళ్ళు పగల గొట్టి నాలుగు రోడ్లు వేయటం అభివృద్ధి కాదన్నారు.

బాపట్లలో ఏ ఒక్క పెట్రోల్ బంకు లేకుండా తనదే నడుపుకుంటూ నియంతలాగా వ్యవహరిస్తున్నారన్నారు. వీటిపై చర్చకు సిద్ధంగా ఉన్నామని అన్నం సతీష్ సవాల్ విసిరారు. అసైన్డ్ భూములను 50 అడుగుల లోతు తవ్వి ఇసుక విక్రయించారన్నారు. తద్వారా కోట్ల రూపాయలు గడించారన్నారు. రాజకీయ నాయకులంటే ఇదేనా అని ప్రశ్నించారు. నియోజకవర్గంలో ఇరిగేషన్ వ్యవస్థ సరిగ్గాలేక రైతులకు ఆరుతడి పంటలకు నీరు అందించలేకపోతున్నారని, ఫిబ్రవరి నెలలోనే పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య రావటం దారుణమన్నారు. ఇలాంటి సంఘటనలు ఇప్పటి వరకు ఎన్నడూ జరగలేదన్నారు. రఘుపతిని ఓడించి బాపట్ల నుంచి వెళ్ళే వరకు పట్టుదలతో పని చేస్తామన్నారు. పేద ప్రజలపై దుప్పట్లు ముసుగు వేస్తున్నారని విమర్శించారు. ప్రశ్నించేవారు లేక ఎమ్మెల్యే రెచ్చిపోతున్నారన్నారు. ప్రజల పక్షాన ఉండి పోరాటం చేస్తామన్నారు. రాబోయే ఎన్నికలలో కోన గెలవరు... ఆ పార్టీ అధికారంలోకి రాదని స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా బాపట్లలో రౌడీయిజం, గుండాయిజం, మర్డర్‌లు, గంజాయి వంటివి యువతను నాశనం చేస్తున్నాయన్నారు. వైసీపీ నాయకులే గంజాయి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు.

అసైన్డ్‌భూములను నిరుపేదలకు పంపిణీ చేయాలి : సీపీఐ

బాపట్లటౌన్, ఫిబ్రవరి 10 : వైసీపీ ప్రభుత్వం భూమిలేని వ్యవసాయ కూలీలు, నిరుపేదలకు అసైన్డ్‌భూములను తక్షణమే పంపిణీ చేయాలని సీపీఐ జిల్లా నాయకుడు జెబి.శ్రీధర్ అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోనేరు రంగారావు భూకమిటీ సిఫార్సు మేరకు ప్రతి నిరుపేద కుటుంబానికి రెండు ఎకరాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. డిసెంబరులో సంభవించిన మిచౌంగ్ తుఫాన్‌కు నష్టపోయిన రైతులకు సంక్రాంతి పండుగకు నష్టపరిహారం అందజేస్తామని ముఖ్యమంత్రి జగన్ చెప్పిన మాటలు అమలు జరగలేదన్నారు. తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులకు రైతు బీమా పథకం కూడా వర్తించలేదని, ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు.

వేసవిలో పంట కాల్వలతోపాటు మురుగు డ్రెయిన్‌లకు మరమ్మతులను చేపట్టాలని డిమాండ్ చేశారు. రంగుమారిన ధాన్యాన్ని ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాల ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఇప్పటి వరకు జిల్లాలో రైతుభరోసా కేంద్రాల ద్వారా రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవటంతో రైతులు అతి తక్కువ ధరకు రైస్‌మిల్లర్లకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకునే వైసీపీ ప్రభుత్వం తక్షణమే పంటనష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో బక్కా రామకృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, బాచిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా నాయకుడు జేబీ శ్రీధర్

కార్పొరేట్ వైద్యసేవలు అభినందనీయం

- మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్

బాపట్ల, ఫిబ్రవరి 10 : ఉచిత వైద్య శిబిరంలో పేదప్రజలకు కార్పొరేట్ వైద్య సేవలందించటం అభినందనీయమని మాజీ ఎమ్మెల్సీ బీజేపీ నాయకుడు అన్నం సతీష్ ప్రభాకర్ అన్నారు. బాపట్ల కాపు కళ్యాణ మండపంలో శనివారం యశోద హాస్పటల్స్, లైఫ్ హాస్పటల్, చీరాల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని అన్నం సతీష్ ప్రారంభించారు. బాపట్ల పరిసరప్రాంతాల నుంచి 210 మంది రోగులకు ఉచిత పరీక్షలు చేసి మందులు అందజేశారు. గుండె, ఎముకలు, రక్తపరీక్షలు ఉచితంగా చేయటమే కాకుండా మందులు అందజేసి భోజనవసతి కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.అవంతి, డాక్టర్ గోపికృష్ణ, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ శ్రీనివాసరెడ్డి, ఎ.రేవంత్, వినోద్, అనురాధ, చాతుర్య, రమేష్, కోటేశ్వరి, సంజయ్, సాయి, ఎస్తేరు, వసంత్, సురేఖ తదితరులు పాల్గొని రోగులకు సేవలందించారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తూ మాజీ ఎమ్మెల్సీ, బీజేపీనాయకులు అన్నం సతీష్ ప్రభాకర్

సౌత్‌ఇండియా కాపు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా శేష తల్పసాయి



శేషతల్పసాయికి నియామక పత్రాన్ని అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు వేల్పూరి శ్రీనివాసరావు

బాపట్ల, ఫిబ్రవరి 10 : సౌత్ ఇండియా కాపు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా పుప్పాల శేషతల్పసాయిని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు వేల్పూరి శ్రీనివాసరావు కాపునాడు కార్యాలయంలో నియామకపత్రాన్ని అందజేశారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం సాధించటం, అవినీతిని అంతం చేయటం తమ లక్ష్యమని శ్రీనివాసరావు అన్నారు. రాజ్యాంగరక్షణకు, ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి కాపు, తెలగ, బలిజ, ఒంటరి, తూర్పు, మున్నూరు కాపు కులస్థులు పెద్దన్న పాత్రలో నిరంతరం మరో స్వాతంత్ర్య పోరాటం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాపునాయకులు పాల్గొన్నారు.

ఫిల్టర్ బావికి మరమ్మతు పనులు వేగవంతం

కర్లపాలెం, ఫిబ్రవరి 10 : కర్లపాలెం పంచాయతీలోని ఫిల్టర్ బావికి మరమ్మతు పనులను శనివారం గ్రామ సర్పంచ్ నక్కా లలితకుమారి ఆదేశాలతో వేగవంతం చేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి మోడి శ్రీనివాసరావు తెలిపారు.



ఫిల్టర్ బావికి మరమ్మతులు చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

- రానున్నది టీడీపీ, జనసేన ప్రభుత్వం
- ఎమ్మెల్యే సోదరుడు అనగాని శివప్రసాద్

రేపల్లె, ఫిబ్రవరి 10 : రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని, రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి అండగా నిలిచి అనగాని గెలుపునకు కృషి చేయాలని ఎమ్మెల్యే సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. రేపల్లె మండలంలోని పేటేరు, బొబ్బర్లంక గ్రామాల్లో శనివారం బాబూ ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అరాచక పాలన వివరిస్తూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజలకు అందించే సంక్షేమ పథకాలను తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నాలుగు సంవత్సరాల 9 నెలల కాలంలో అవినీతి, అక్రమాల ప్రభుత్వంతో ప్రజలు విసిగి వేసారిపోయారన్నారు. సంక్షేమ పథకాల పేరుతో జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు రూపాయి ఇచ్చి వెయ్యి రూపాయలు దోచుకుతింటున్నారన్నారు. ఈవిషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పేద, మధ్యతరగతి కుటుంబాలపై అధిక భారం మోపి రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగిస్తున్నారన్నారు. ప్రతిపక్షాలు సమస్యలను లేవనెత్తి ప్రభుత్వంపై పోరాటం చేస్తుంటే పోలీసులను అడ్డుపెట్టుకుని కక్షపూరితంగా వ్యవహరిస్తూ వారిపై తపుడు కేసులు బనాయిస్తున్నారన్నారు. రేపల్లె రూరల్ మండలంలో పేటేరు నుంచి ఓలేరు వెళ్ళే రహదారి పేటేరులో అంతర్గత రహదారులు అరవపల్లి నుంచి తుమ్మల బొబ్బర్లంక వెళ్ళే రహదారులు అభివృద్ధికి నోచుకోక మోకాలు లోతు గుంతల్లో రాకపోకలు సాగిస్తుంటే ఎంతోమంది ప్రమాదాలకు గురై నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఒక్క రహదారికైనా వైసీపీ పాలనలో తట్టెడు మట్టి వేసిన దాఖలాలు లేవని తెలిపారు. ప్రజలంతా టీడీపీకి అండగా నిలిచి తీరప్రాంతం అంతా అభివృద్ధి చేసే విధంగా అనగానికి అండగా ఉండాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పంతాని మురళీధరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు రేపల్లె రామాంజనేయులు, జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు రాసంశెట్టి మహేష్, దేవగిరి రవి, చందోలు ప్రసాద్, జీవీ నాగేశ్వరరావు, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, వడ్డి లక్ష్మీజీ తదితరులు పాల్గొన్నారు.



బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ కరపత్రాలు అందిస్తున్న అనగాని శివప్రసాద్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తున్న కాంగ్రెస్

- ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల, ఫిబ్రవరి 10 : భూస్థాపితమైన కాంగ్రెస్‌పార్టీ ఉనికిని చాటుకునే ప్రయత్నం పీసీసీ అధ్యక్షురాలు షర్మిల చేస్తున్నదని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే కోన మాట్లాడుతూ బాపట్ల పర్యటనలో షర్మిల అభ్యంతర వ్యాఖ్యలు చేశారని ఆమెను కాబట్టి ఊరు దాటనిచ్చామన్నారు. మరొకరైతే అలా ఉండేదికాదన్నారు. ఒకసారి వదిలాం మరోసారి ఆ విధంగా కుదరదన్నారు. హైవే రోడ్డు నిర్మాణానికి ఇసుక వినియోగిస్తే విమర్శలు చేయటం సరి కాదన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు వడ్డిముక్కల డేవిడ్, ఇనగలూరి మాల్యాద్రి, జోగి రాజా, ఎం.పాపారావు, సీనియర్ నాయకులు గవిని కృష్ణమూర్తి, చేజర్ల నారాయణరెడ్డి, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి బూత్ కమిటీ సభ్యుల సమావేశం

కర్లపాలెం,ఫిబ్రవరి 10 : రానున్న అసెంబ్లీ ఎన్నికలలో బాపట్ల నుంచి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించి, రాష్ట్రానికి మళ్ళీ ముఖ్యమంత్రిగా జగన్మోహనరెడ్డి చేయాలని ఎమ్మెల్యే కోన రఘుపతి పిలుపునిచ్చారు. శ్రీపెద్దింటమ్మ కళ్యాణ మండపంలో శనివారం మండలస్థాయి బూత్ కమిటీ సభ్యుల సమావేశంలో ఎమ్మెల్యే కోన మాట్లాడారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుడి కుటుంబానికి ఆర్థికసాయం

కర్లపాలెం, ఫిబ్రవరి 10 : మండలంలోని పాత కర్లపాలెంలో భవన నిర్మాణ కార్మికుడు షేక్ సుభానీ అనారోగ్యంతో మృతి చెందాడు. తాపీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం యూనియన్ నాయకులు మట్టి ఖర్చుల కింద రూ.4 వేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో పిట్టు కాసులరెడ్డి, షేక్ కరీముల్లా, పఠాన్ జలీల్‌ఖాన్, బాబు, బాషా పాల్గొన్నారు.



కార్మికుడి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న తాపీ వర్కర్స్ యూనియన్ నాయకులు

గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలి : సీపీఎం

కొల్లూరు, ఫిబ్రవరి 10 : దేశ వ్యాప్తంగా ఈ నెల 16వ తేదీన జరుగుతున్న గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య పిలుపునిచ్చారు. కొల్లూరులోని ప్రజా సంఘాల కార్యాలయంలో శనివారం ఆ పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. గంగయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్మిక, కర్షకుల హక్కులను కాలరాస్తుందన్నారు. 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు పరచకుండా పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యవసర ధరలను పెంచి ప్రజలపై మోయలేని భారం వేసిందన్నారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నిందన్నారు. అందులో భాగంగానే దేశ సంపదను అంబానీ, ఆదాని వంటి కార్పొరేట్ శక్తులకు కారుచౌకగా దోచి పెడుతుందని విమర్శించారు. గ్రామీణ ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతూ తలపెట్టిన దేశ వ్యాప్త బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. మండల పార్టీ నాయకులు బి.సుబ్బారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు టి.కృష్ణమోహన్, మండల నాయకులు వి.వెంకట్రామయ్య, పి.నాగమల్లేశ్వరరావు, మాజీ ఎంపీపీ కృపానందం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

ఘనంగా శ్రీనివాస కల్యాణం

నగరం, ఫిబ్రవరి 10 : స్థానిక లక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో 4వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం శ్రీనివాస కల్యాణం అంగరంగ వైభవంగా ఒంగోలుకు చెందిన త్రినాథ చార్యులు నిర్వహించారు. ఆలయ చైర్మన్ సురేష్ కుమార్, జగదీష్‌కుమార్ దంపతులు కల్యాణంలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం వందలాది భక్తులకు అన్న సంతర్పణ నిర్వహించారు.



శ్రీనివాస పద్మావతి కల్యాణ మహోత్సవంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

విద్యార్థుల భవిష్యత్తుకు మంచి చేతి రాత దోహదం

భట్టిప్రోలు, ఫిబ్రవరి 10 : విద్యార్థుల భవిష్యత్‌కు మంచి చేతి రాత ఎంతగానో దోహదపడుతుందని, విద్యార్థులు చేతి రాత ఆవశ్యకతను తెలుసుకుని దృష్టి సారించాలని ఎంఈఓ-2 ఎన్.దేవరాజ్ అన్నారు. మండలంలోని ఐలవరం జిల్లా పరిషత్ హైస్కూలులో శనివారం మంచి చేతి రాతపై విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. చేతి రాత నిపుణులు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఉప్పాల రామమోహనరావు బృందం శిక్షణ ఇవ్వడం జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన శిక్షణా కార్యక్రమంలో మండలం నుండే కాక ఇతర మండలాల నుంచి ఆసక్తి కలిగిన ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరయ్యారు. శిక్షణ అనంతరం చేతి రాతపై పోటీ పరీక్ష నిర్వహించగా ఉపాధ్యాయులలో టీఎంరావ్ హైస్కూలుకు చెందిన రమ్య, నిజాంపట్నం సోషల్ వెల్ఫేర్ స్కూలుకు చెందిన అన్నామణిలకు ప్రథమ, ద్వితీయ బహుమతులు అందుకున్నారు. విద్యార్థుల విభాగంలో ఐలవరం హైస్కూలుకు చెందిన మాచర్ల గాయత్రి ప్రథమ బహుమతి అందుకుంది. ఈ కార్యక్రమం ఏర్పాటుకు కృషి చేసిన ఆంగ్ల ఉపాధ్యాయులు పి.హరికృష్ణను ఎంఈవో దేవరాజ్, హెచ్‌ఎం మాచర్ల మోహనరావు అభినందించారు. పాఠశాల పూర్వ విద్యార్థి నల్లూరి శ్రీకాంత్ అందించిన సహాయ, సహకారాలతో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు భోజన వసతిని కల్పించారు.



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో -2 దేవరాజ్

మాజీ మంత్రి నారాయణ ఆఫీసుపై దాడి కక్ష సాధింపు చర్య

భట్టిప్రోలు, ఫిబ్రవరి 10 : మాజీ మంత్రి కె.నారాయణ ఆఫీసు, కళాశాలలపై దాడి వైసీపీ రాజకీయ కక్ష మాత్రమేనని సౌత్ ఇండియన్ కాపు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వేల్పూరి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ నుంచి జగన్‌కు చెందిన జైలు పార్టీలోకి రాలేదనే కక్ష సాధింపు చర్యలలో భాగంగా డ్రగ్స్ అండ్ కంట్రోల్ అధికారులు, పోలీసులు సోదాలు నిర్వహించారన్నారు. అనుమతి లేని ఫార్మసీ మందులు వాడుతున్నారనే సాకుతో తనిఖీలు చేయడం సీఎం జగన్ కుట్రలో భాగమేనని ఆయన ఆరోపించారు. జగన్‌రెడ్డి డైరెక్షన్‌లోనే డ్రగ్స్ డీజీ రఘురామిరెడ్డి ఓవరాక్షన్ చేయడం సిగ్గుచేటన్నారు. జగన్‌రెడ్డి నేరాలు, ఘోరాలు గురించి తన సోదరి షర్మిల చెప్పడంతో జగన్‌కు మతిపోయిందన్నారు. ఎలాగైనా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి రాజారెడ్డి రాజ్యాంగాన్ని రాష్ట్రంలో అమలు చేయాలనే జగన్‌రెడ్డి తీరును ప్రజలు గమనిస్తున్నారని ఆయన అన్నారు. ప్రజాస్వామ్య రక్షణ కోసం ప్రజలందరూ చైతన్యవంతులై రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.

నేడు జంపనిలో టీడీపీలో చేరనున్న వైసీపీ మైనార్టీ శ్రేణులు

వేమూరు, ఫిబ్రవరి 10 : మండలంలోని జంపని గ్రామానికి చెందిన వైసీపీ మైనార్టీ శ్రేణులు ఆదివారం పెద్ద సంఖ్యలో టీడీపీలో చేరనున్నట్లు బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు గ్రామంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిస్తారని అనంతరం మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు సమక్షంలో మైనార్టీలు పెద్ద సంఖ్యలో టీడీపీ తీర్థం పుచ్చుకుంటారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

నేడు పెరవలిపాలెంలో జనసేన, టీడీపీ సంయుక్త సభ

వేమూరు, ఫిబ్రవరి 10 : మండలంలోని పెరవలిపాలెం గ్రామంలో ఆదివారం సాయంత్రం జనసేన పార్టీ ఆధ్వర్యంలో జనసేన, తెలుగుదేశం పార్టీల సంయుక్త సభా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త ఊస రాజేష్ తెలిపారు. ముందుగా బైక్ ర్యాలీ నిర్వహించి అనంతరం గ్రామంలో జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ జరుపుతారన్నారు. అనంతరం నిర్వహించే సభా కార్యక్రమానికి మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు, ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదెవెంకటేశ్వరరావు, జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండారు రవికాంత్, బాపట్ల పార్లమెంటు స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, జనసేన పార్టీ కృష్ణ, పెన్నా మహిళా రీజనల్ కో ఆర్డినేటర్ బోని పార్వతి నాయుడు హాజరవుతారన్నారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన పార్టీలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

వేమూరు నియోజకవర్గ బీసీ సంఘం అధ్యక్షుడిగా వాసుదేవ్

కొల్లూరు, ఫిబ్రవరి 10 : జాతీయ బీసీ సంఘం తరఫున వేమూరు నియోజకవర్గ బీసీ సంఘం అధ్యక్షుడిగా మురాల వాసుదేవ్ గౌడ్‌ను నియమించారు. బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడుగా ఆర్.కృష్ణయ్య ఆశీస్సులతో రాష్ట్ర అధ్యక్షుడు శౌంతి నాగరాజు నియామకం పత్రం అందజేసినట్లు వాసుదేవ్ శనివారం తెలిపారు. రెండు సంవత్సరాలుగా నియోజకవర్గంలో బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై పూర్తి అవగాహన ఉందని, వారి సమస్యలు పరిష్కరిస్తూ బీసీ సంఘ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. తమ నియామకానికి కృషి చేసిన రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజుకు ధన్యవాదాలు తెలిపారు.



వాసుదేవ్‌కి నియామక పత్రం అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు

జగన్‌రెడ్డి అరాచకాలపై శంఖారావం

- ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్



ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

రేపల్లె, ఫిబ్రవరి 10: సీఎం జగన్మోహన్‌రెడ్డి, వైసీపీ నాయకుల అరాచకాలకు వ్యతిరేకంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పూరించిన నామమే శంఖారావం అని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ పర్యటించని నియోజకవర్గాల్లో శంఖారావంతో పర్యటించి జగన్‌రెడ్డి ప్రభుత్వ దౌర్జన్యాలపై ప్రజలకు కార్యకర్తలకు తెలియజేయనున్నారు. నిరుద్యోగంతో యువత ఇబ్బందులు పడుతుండగా ధరల పెరుగుదలతో రాష్ట్ర ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలకు భరోసా కల్పించేందుకే టీడీపీ శంఖారావం అనే కీలక ప్రచారాన్ని శ్రీకారం చుట్టారన్నారు. 50 రోజుల్లో 120 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటించనున్నారని, ఆ శంఖారావం ద్వారా ఆయా ప్రాంతాల్లోని ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ముందుకు కొనసాగుతారన్నారు. సూపర్‌సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్ళి రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు వివరిస్తూ ప్రతి ఇంటికి చేరువవుతారన్నారు. జగన్‌రెడ్డి ప్రభుత్వంలో బాధితులుగా మారిన అన్ని వర్గాల ప్రజలకు పాదయాత్రల ద్వారా నారా లోకేశ్ భరోసా ఇచ్చారని శంఖారావం ద్వారా ప్రజలకు మరింత చేరువయ్యేలా పర్యటన కొనసాగిస్తామని ఒక ప్రకటనలో తెలిపారు.

శంఖారావం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

- విశ్రాంత ఐఆర్‌ఎస్ అధికారి, టీడీపీ నాయకుడు దగ్గుమళ్ళ



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న విశ్రాంత ఐఆర్‌ఎస్ అధికారి దగ్గుమళ్ళ ప్రసాదరావు

బాపట్ల, ఫిబ్రవరి 10 : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువనాయకుడు నారా లోకేశ్ చేపట్టనున్న శంఖారావం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విశ్రాంత ఐఆర్‌ఎస్ అధికారి, టీడీపీ నాయకుడు దగ్గుమళ్ళ ప్రసాదరావు పిలుపునిచ్చారు. ఈ విషయమై శనివారం బాపట్ల పట్టణంలో పార్టీశ్రేణులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ప్రసాదరావు మాట్లాడుతూ విశేష రాజకీయ అనుభవం గడించిన లోకేశ్ ఇప్పటికే యువగళం పేరుతో పాదయాత్ర చేసి ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేశారన్నారు. ఈ పాదయాత్ర ద్వారా రాష్ట్రంలో ఉన్న సమస్యలు ప్రజలకు వివరించి వాటికి తగిన బదులిచ్చారన్నారు. చంద్రబాబునాయుడు వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న నారా లోకేశ్ చేపట్టే శంఖారావం కార్యక్రమాన్ని ఆశీర్వదించాలని ఆయన ఆకాంక్షించారు. బాపట్ల పార్లమెంట్ సీటును తనకు కేటాయించాలని ఇప్పటికే అధినేత నారా చంద్రబాబునాయుడు, యువనేత లోకేశ్, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్ళామన్నారు. వారు మంచిగా స్పందించారని అవకాశం ఇస్తే గెలిచి బాపట్ల పార్లమెంట్‌ను భారతదేశం గర్వించే స్థాయిలో అభివృద్ధి చేస్తానన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం తాను చేస్తున్న వ్యాపారాలు మొత్తం కుమారునికి అప్పగించి పూర్తి స్థాయి రాజకీయాలలో కొనసాగాలని నిర్ణయించామన్నారు. రాబోయే 30 సంవత్సరాలు గుర్తిండిపోయే విధంగా పరిశ్రమలు, వ్యవసాయం, ఇరిగేషన్, ఉద్యోగావకాశాలు వంటివి కల్పించటానికి కృషి చేస్తానన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవతోటి సుందరయ్య, బాపట్ల పార్లమెంట్ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు జంగం ప్రవీణ్, విశ్రాంత సీఈవో జంగం రాజశేఖరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ దేటా జోసఫ్, మాజీ సర్పంచ్ కె.శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఎంపీటీసీ మద్దాల డేవిడ్, బి.సాల్మన్‌రాజు, డి.డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వాన్ని తరిమి కొట్టేందుకు ప్రజలు సిద్ధం

- టీడీపీ మాజీ ఎంపీపీ విచారపు వీరయ్య

నగరం, ఫిబ్రవరి 10 : రానున్న ఎన్నికల్లో జగన్ ప్రభుత్వాన్ని తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని టీడీపీ మాజీ ఎంపీపీ విచారపు వీరయ్య అన్నారు. నగరం మండలంలోని పలు గ్రామాల్లో శనివారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజలకు ఎలాంటి పథకాలు అందిస్తామనే దానిపై వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి నాలుగున్నర సంవత్సరాల పాలనలో తీరప్రాంతంలో ఎక్కడైన అభివృద్ధి జరిగిందా అని ప్రశ్నించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలు బతికే పరిస్థితి లేదన్నారు. వైసీపీ నాయకులంతా తీరంలో ఇసుక, మట్టి ఇష్టానుసారంగా తవ్వకాలు జరుపుతూ కోట్ల రూపాయలు దోచుకుతింటున్నారే తప్పా ప్రజలకు మేలు చేసింది ఏమీ లేదన్నారు. ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసి వారి స్వలాభం కోసం అక్రమ సంపాదనే ధ్యేయంగా పరిపాలన సాగిస్తున్నారని ఇదేమిటని ప్రశ్నిస్తే తప్పుడు కేసులు పెట్టి బెదిరింపులకు గురి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చింతల సుబ్బారావు, లుక్కా గుడారంకయ్య, పీవీ చింతారావు, మేకా శివరామకృష్ణ పాల్గొన్నారు.



బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు కరపత్రాలను అందిస్తున్న టీడీపీ నాయకులు

భగవన్నామ స్మరణతోనే ముక్తికి మార్గం



సమావేశంలో మాట్లాడుతున్న హేమశంకరరావు

రేపల్లె, ఫిబ్రవరి 10 : కలియుగంలో భగవన్నామస్మరణ ముక్తికి మార్గమని, ప్రత్యక్ష దైవం వేంకటేశ్వర స్వామిని పూజించటం వల్ల ఆ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉంటాయని సమరత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మప్రచారక్ జంజనం హేమశంకరరావు అన్నారు. మండలంలోని పోటుమెరక గ్రామంలో జాలార్తమ్మ కాలనీలో టీటీడీ రూ.10 లక్షల ఆర్థిక నిధులతో సమరత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించి సంకీర్తనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవచింతనతో మెలిగితే ఆ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉంటాయని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పేరం కోటేశ్వరరావు, వి.సుందరరామిరెడ్డి, కామేశ్వరరావు, వీరరాఘవయ్య, నాగరాజు, కట్టా మహేష్ పాల్గొన్నారు.

బాపట్లరూరల్, వెదుళ్ళపల్లి ఎస్సైలుగా రవిశంకర్‌రెడ్డి, అజిత



రవిశంకర్‌రెడ్డి



అజిత

బాపట్లరూరల్, ఫిబ్రవరి 10 : బాపట్లరూరల్ ఎస్సైగా రవిశంకర్‌రెడ్డి, వెదుళ్ళపల్లి ఎస్సైగా అజిత శనివారం బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో యువకులు, ప్రజలు ఎటువంటి అల్లర్లు, గొడవలకు పాల్పడకుండా ఏదైన సమస్య ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని తెలిపారు.

గడియార స్తంభం నిర్మాణం ఎప్పుడో..!

- రూ.22 లక్షలతో టెండర్
- పనులు ప్రారంభించని కాంట్రాక్టర్

చీరాల, ఫిబ్రవరి 10: గడియార స్తంభం నిర్మాణ పనులు ఒక్కడుగు కూడా ముందుకు పడలేదు. గడియార స్తంభం అనేది చీరాలకు ఒక ల్యాండ్ మార్క్. గత కొన్ని సంవత్సరాలుగా ఈ సెంటర్లో గడియార స్తంభం లేదు. ఒకటికి రెండు పర్యాయాలు ఉన్నవాటిని తొలగించారు. ఆతరువాత నూతనంగా నిర్మిస్తామన్న గడియార స్తంభం నిర్మాణం మాటలకే పరిమితమైంది. మధ్యలో ఐటీసీ వారు తాము నిర్మిస్తామని చెప్పిన మాటలకు కూడా ఆటంకాలు ఎదురయ్యాయి. దీంతో వారు వెనక్కు తగ్గారు. టెండరు పొందిన కాంట్రాక్టరు పనులు చేపట్టంలో జా ప్యం చేస్తున్నారు. దీనిపై పురప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

చీరాల, పేరాల గ్రామాలను కలిపి మున్సిపాలిటీగా చేపట్టిన మొదటి చర్యను అప్పట్లో ఆ రెండు గ్రామాల ప్రజలు తిరస్కరించారు. ఆక్రమంలో దుగ్గిరాల గోపాలకృష్ణయ్య నాయకత్వంలో పన్నులు భారం మోయలేమని పురబహిష్కరణ పిలుపుమేరకు అందరూ గ్రామాలను విడిచివెళ్లారు. ఈక్రమంలో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం కూడా తమ నిర్ణయాన్ని వెనక్కు తీసుకుంది. ఆతరువాత జరిగిన పరిణామాల క్రమంలో చీరాల మున్సిపాలిటీగా ప్రకటించారు. ఈనేపథ్యంలో మొదటి మున్సిపల్ ఛైర్మన్ అన్నదాత నాగేంద్రుడు హయాంలో చీరాల, పేరాల మధ్యఉన్న పొలిమేర రోడ్డు కూడలిలో భారీ గడియార స్తంభాన్ని నిర్మించారు. సమీపంలో టౌన్‌హాల్ ఉండేది. అప్పట్లో ప్రజలు టౌన్‌హాల్‌లో జరిగే కార్యక్రమాలను వీక్షించేందుకు, రేడియో ప్రసారాలు వినేందుకు, ఐటీసీ కంపెనీలో కార్మికులు తాము విధులకు హాజరయ్యే సమయాన్ని తెలుసుకునేందుకు గడియార స్తంభంలోని గడియారం సూచించే సమయాన్ని అనుసరించేవారు. తరువాత కాలంలో పట్టణ జనాభా పెరిగింది. మారిన కాలానికి అనుగుణంగా వాచీలు వచ్చాయి. ఈక్రమంలో గడియార స్తంభంలో సూచించే సమయం మీద ఆధారపడేవారి సంఖ్య తగ్గింది.

అయితే, గడియార స్తంభం సెంటర్, గడియార స్తంభం అనే ల్యాండ్ మార్క్(కొండగుర్తు) జనాల్లో అప్పటికి, ఇప్పటికి ఉంది. తొలిసారిగా ఏర్పాటుచేసిన గడియార స్తంభాన్ని సుమారు దశాబ్దన్నర క్రితం తొలగించారు. కొన్ని సంవత్సరాలు తరువాత రూ.14 లక్షలతో మరో గడియార స్తంభాన్ని (పాత గడియార స్తంభంకన్నా ఎత్తు తక్కువ) నిర్మించారు. అయితే, అందులో ఉన్న నాలుగు గడియారాలు ఏరోజు సరైన సమయాన్ని చూపేవికావు. తరువాత దాన్ని కూడా తొలగించారు. ఆప్రాంతంలో ఉన్న పాతమున్సిపల్ కాంప్లెక్స్‌ను తొలగించి, కొత్త కాంప్లెక్స్ నిర్మాణం చేసిన తరువాత ఆ కాంప్లెక్స్‌పై గడియార స్తంభం ఏర్పాటుచేస్తామని చెప్పారు. అది జరిగి కూడా సంవత్సరాలు గడుస్తోంది. సదరు కాంప్లెక్స్ నిర్మాణం బాలరిష్టాలు దాటి ఎట్టకేలకు ప్రారంభమైంది. అయితే, గడియార స్తంభం నిర్మాణం మాత్రం జరగలేదు.

ఈక్రమంలో ఐఎల్‌టీడీ, ఐటీసీ కంపెనీ స్థాపించి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఏదో ఒక ఐకాన్ ఉండేవిధంగా ఆలోచనచేసి, అందుకు గడియార స్తంభం నిర్మాణం చేపడితే బాగుంటుందని పాలకులు, అధికారులను సంప్రదించారు. ఆతరువాత వారికి ఏ ఆటంకం ఏర్పడిందో ఏమో వెనకడుగు వేశారు. దీంతో మున్సిపల్ పరంగా నిర్మాణం చేపట్టేందుకు టెండరు ప్రక్రియ పూర్తిచేశారు. రూ.22 లక్షల అంచనా వ్యయంతో నిర్మాణం చేయాలని భావించారు. టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ సదరు పనులు ప్రారంభించలేదు. మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి సదరు గడియా స్తంభం నిర్మాణం పనులు ప్రారంభించి నిర్దీత కాలవ్యవధిలో పూర్తయ్యేవిధంగా చర్యలు చేపట్టాలని పురప్రజలు కోరుతున్నారు.



పాత గడియార స్తంభం(ఫైల్)

వైసీపీ అరాచకాలపై లోకేష్ శంఖారావం

- ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్



అద్దంకి, ఫిబ్రవరి 10: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, వైసీపీ నాయకుల అరాచకాలకు వ్యతిరేకంగా, వారు సాగిస్తున్న దారుణాలకు గట్టిగా సమాధానం చెప్పేలా.. అన్ని వర్గాలకు అండగా నిలి చేలా ఆదివారం నుంచి లోకేష్ పూరించే నాధమే శంఖారావం అని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఈమేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ పర్యటించని నియోజకవర్గాలలో శంఖారావం ద్వారా పర్యటిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రజలకు భరోసా కల్పించేందుకు టీడీపీ శంఖారావం శ్రీకారం చుట్టిందన్నారు. రాబోయే 40 రోజులలో నారా లోకేష్ 120 నియోజకవర్గాలలో పర్యటించనున్నారన్నారు. శంఖారావం ద్వారా టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పడ్డాక చేపట్టబోయే పథకాలను వివరిస్తారని చెప్పారు. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు శంఖారావం సభలను విజయవంతం చేయాలని రవికుమార్ కోరారు.

నేటి పర్యటన వివరాలు

అద్దంకి, ఫిబ్రవరి 10: ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ఆదివారం పలు కార్యక్రమాలకు హాజరుకానున్నారు. ఉదయం 10 గంటలకు బల్లికురవ, 10.30కి ముక్తేశ్వరం, 11 గంటలకు అద్దంకి పట్టణంలోని 7వ వార్డు, మధ్యాహ్నం 12 గంటలకు ఒంగోలులలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

యోగ గురువు శేషారెడ్డి దంపతులకు సత్కారం

అద్దంకి, ఫిబ్రవరి 10: తోటి వారికి సహాయం చేయటం కనీస బాధ్యతగా భావించిన రోజు అందరూ సంతోషంగా ఉంటారని యోగా గురువు శేషారెడ్డి అన్నారు. అద్దంకి పట్టణంలోని న్యూ ఎస్‌బీఐ కాలనీలో గత రెండు దశాబ్దాలుగా ఎలాంటి లాభాపేక్ష లేకుండా యోగ శిక్షణ ఇస్తున్న రిటైర్డ్ మిలటరీ ఉద్యోగి శేషారెడ్డి, అంజమ్మ దంపతులను శనివారం శిష్య బృందం ఘనంగా సన్మానించారు. అంజమ్మ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి దంపతులకు నూతన వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో మన్నం త్రిమూర్తులు, చుండూరి మురళీసుధాకర్, డాక్టర్ సుధాకర్, చాగంటి వేణుగోపాల్‌రెడ్డి, అత్తులూరి రమేష్, ఆలూరి వెంకటరావు, మంగమూరు సుబ్బారావు, గార్లపాటి ఆదినారాయణ, శేషారావు, మారుతీ, రమేష్, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలి



మఠాధిపతి వీరకుమార స్వామిని సత్కరిస్తున్న భక్తులు

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 10: నేటి సమాజంలో అందరూ సుఖశాంతులతో జీవించాలని ఈశ్వరీదేవి పీఠ మఠాధిపతులు వీరకుమారస్వాములు అన్నారు. శనివారం అద్దంకి వచ్చిన ఆయన స్థానిక కాకానిపాలెంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈశ్వరిదేవి పీఠం ఏర్పాటుచేసి 108 మంది మహిళలచే సామూహిక కుంకుమార్చన జరిపారు. వీరబ్రహ్మేంద్రస్వామి వారి కాలజ్ఞాన వచనాలను ప్రచారం కల్పించిన జగన్మాత ఈశ్వరిదేవి అమ్మవారు అని అన్నారు. ప్రకాశం జిల్లాలో బొల్లాపల్లి, రాచర్ల, కొత్తపట్నం, ముప్పవరం తదితర ప్రాంతాలల్లో ఎక్కువగా పర్యటించారన్నారు. ప్రస్తుతం అమ్మవారి పీఠంతో పర్యటిస్తూ వారి కావ్యాలకు విస్తృత ప్రచారం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈసందర్భంగా వీరకుమార స్వామిని కమిటీ సభ్యులు, భక్తులు ఘనంగా సన్మానించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గోనుగుంట రజిని, దేవస్థాన ధర్మకర్త ఉండవల్లి కృష్ణారావు, అనంతు వెంకటసుబ్బారావు, పొన్నపల్లి బ్రహ్మానంద, చెన్నుపల్లి శ్రీనివాసచారి, రవికుమార్, వీరయ్య, వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు

చినగంజాం, ఫిబ్రవరి 10: విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంఈవో-2 కోటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు ఎం.దేవదత్తం అన్నారు. మండలంలోని పెదగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 2023-2024 విద్యా సంవత్సరం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ, పాఠశాల వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకొని ప్రణాళిక ప్రకారం చదవాలని ఎంఈవో సూచించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ వి.ఉదయభాస్కర్, ఉపాధ్యాయులు డి.నారాయణరెడ్డి, బి.నాగేశ్వరరావు, ఎ.వీరాచారి, ఎన్.రమణమూర్తి, షేక్ సుభాని బాషా, జి.హావీలదేవి, పీడీ అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ఠ మహోత్సవ పూజలు

చినగంజాం, ఫిబ్రవరి 10: పల్లెపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దపల్లెపాలెం గ్రామంలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి నూతన ఆలయ ప్రతిష్ఠ మహోత్సవ పూజలు శనివారం రాత్రి ఘనంగా ప్రారంభించారు. ఆలయ ప్రతిష్ఠను పురస్కరించుకొని రాత్రి 7 గంటల నుండి వేదపండితులు దంపతులచే విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అఖండదీపారాధన, అంకురారోపణం తదితర పూజలు, హోమాలు నిర్వహించారు. శనివారం నుంచి బుధవారం వరకు పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు లక్ష్మీనరసింహస్వామి భక్తులు తెలిపారు. ఈనెల 14న లక్ష్మీనరసింహస్వామి, శిఖర గరుడ ఆళ్వార్ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలి

పంగులూరు, ఫిబ్రవరి 10: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తే ఈనెల 16న దేశవ్యాప్తంగాగా జరిగే గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య పిలుపునిచ్చారు. పంగులూరులోని రోటరీ భవనంలో శనివారం ప్రజాసంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలో ప్రతిఏటా కేంద్ర ప్రభుత్వం రెండు లక్షల కోట్ల రూపాయలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతుందని చెప్పారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు అందక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 6400 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కందిమళ్ల రామకోటేశ్వరరావు, రాయిణి కృష్ణకుమారి, వినోద్‌బాబు, మల్లారెడ్డి, సునందబాబు, వీరవల్లి కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పర్చూరు ఎస్ఐగా రమేష్ బాధ్యతల స్వీకరణ

పర్చూరు, ఫిబ్రవరి 10 పర్చూరు సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎస్.రమేష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. నిజాంపట్నం ఎస్సైగా విధులు నిర్వహిస్తూ సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సాధారణ బదిలీపై పర్చూరు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన రవిశంకర్‌రెడ్డి బాపట్ల ఎస్పీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. నూతనంగా విధులు చేపట్టిన ఎస్సైకి సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

కారంచేడు ఎస్ఐగా సురేష్

కారంచేడు(పర్చూరు), ఫిబ్రవరి 10: కారంచేడు ఎస్సైగా కె.సురేష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సాధారణ బదిలీల్లో భాగంగా చినగంజాం ఎస్సైగా విధులు నిర్వహిస్తూ కారంచేడు బదిలీపై వచ్చారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సైకి సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టిసారించనున్నట్లు ఈసందర్భంగా ఎస్సై తెలిపారు.

ఆసరా చెక్కుల పంపిణీనా.. వైసీపీ బహిరంగ సభా!

- అధికారులు, వైసీపీ నేతల తీరుపై
- స్వయం సహాయక సంఘాల సభ్యుల విమర్శ

అద్దంకి, ఫిబ్రవరి 10: స్వయం సహాయక సంఘాలకు ఆసరా చెక్కుల పంపిణీ కాస్తా వైసీపీ బహిరంగసభను తలపించేలా నిర్వహించటం విమర్శలకు తావిస్తుంది. అద్దంకి పట్టణంలోని శ్రీప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం అద్దంకి మండలం పరిధిలోని స్వయం సహాయక సంఘాల సభ్యులతో వైఎస్ఆర్ ఆసరా నాలుగో విడత సంబరాల కార్యక్రమం నిర్వహించారు. అయితే, సభ ఆవరణ అలంకరణతో పాటు, స్టేజ్ మొత్తం వైసీపీ రంగులను పోలిన బెలూన్‌లు, టెంట్ సైడ్‌వాల్స్‌తో తయారు చేశారు. ప్రభుత్వ కార్యక్రమంలా కాకుండా వైసీపీ పార్టీ కార్యక్రమంలో నిర్వహించటం పట్ల పలువురు స్వయం సహాయక సంఘాల సభ్యులు విమర్శిస్తున్నారు. అదే సమయంలో ప్రసంగాలు కూడా వైసీపీ నేతల పొగడ్తలతో కొనసాగటం పట్ల కూడా విమర్శిస్తున్నారు. సభకు హాజరైన వారిలో అధికారులు, ప్రజాప్రతినిధుల కంటే వైసీపీ నేతలే అధిక సంఖ్యలో ఉండటం విశేషం. పేరుకే స్వయం సహాయక సంఘాల సమావేశం కాని నిర్వహణ తీరు మొత్తం వైసీపీ ప్రచారంలా సాగిందన్న విమర్శలు వస్తున్నాయి. వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాణెం హనిమిరెడ్డి హాజరై ఆసరా చెక్కులు పంపిణీ చేశారు.

ఎంపీడీవో సత్యనారాయణ, ఏరియా కోఆర్డినేటర్ రవి, ఏపీఎం కోటేశ్వరరావు, ఎంపీపీ అవివన జ్యోతి, జడ్పీటీసీ జ్యోతి వెంకటరత్నం, వైసీపీ నేతలు జ్యోతి హనుమంతరావు, గుజ్జుల జగన్మోహనరెడ్డి, అవిసన ప్రభాకర రెడ్డి, మాకినేని శ్రీనివాసరావు, జజ్జర ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.



ఆసరా చెక్కుల పంపిణీ సభ స్టేజి మొత్తం నిండిఉన్న వైసీపీ రంగుల బెలూన్‌లు

ఆగిఉన్న లారీని ఢీకొన్న కారు.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

అద్దంకి, ఫిబ్రవరి 10: ఆగి ఉన్న లారీని వెనుకనుంచి కారు ఢీ కొనటంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇస్కా శ్రావణ్‌కుమార్‌రెడ్డి(33) అక్కడకక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు జిల్లా జలదంకికి చెందిన శ్రావణ్‌కుమార్‌రెడ్డి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఇంకా వివాహం కాకపోవటంతో స్వగ్రామంలో ఉన్న తల్లి సుశీలను తీసుకువెళ్లేందుకు జలదంకి వెళుతున్నాడు. ఈక్రమంలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత 2 గంటల సమయంలో శింగరకొండ, అద్దంకి మధ్యలో నామ్ రోడ్డు మార్జిన్‌లో ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీ కొట్టాడు. ఈప్రమాదంలో కారు బెలూన్‌లు ఓపెన్ అయినా శ్రావణ్‌కుమార్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. పొగమంచు దట్టంగా ఉండటం, ఆగిఉన్న లారీ సిగ్నల్ లైట్లు వేయకపోవటంతో ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. తల్లి సుశీల ఫిర్యాదు మేరకు పోలీసులు నమోదు చేశారు.



ప్రమాదస్థలంలో ఉన్న లారీ, ధ్వంసమైన కారు, మృతి చెందిన శ్రావణ్‌కుమార్‌రెడ్డి

జానపద కళలను రక్షించుకోవాలి

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 10: మన సంస్కృతిలో జానపద కళలు ప్రధాన భాగమని, ఆచార వ్యవహారాలకు అద్దంలాంటి వాటిని రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైద్యులు డాక్టర్ సీహెచ్ ఫణీంద్రబాబు అన్నారు. శనివారం పట్టణంలోని గీతామందిర్‌లో జానపద కళాపీఠం ఆధ్వర్యంలో విద్వాన్ జ్యోతి చంద్రమౌళి రచించిన జానపదాలు-జ్ఞాన పదాలు అనే గ్రంథావిష్కరణ కళాపీఠం అధ్యక్షుడు డాక్టర్ యు.దేవపాలన అధ్యక్షతన జరిగింది.

ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ ఫణీంద్రబాబు గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ అంతరించిపోతున్న ప్రాచీన కళలు నేటి తరానికి తెలియకుండా పోతున్నాయని అన్నారు. కొన్ని కళలు ఇప్పటికే అంతరించిపోయాయని చెప్పారు. నాటి కళలు, కళల పేర్లను, పదాలను నేటి యువత మరిచిపోవడంతో పాటు ఆనందాన్ని కోల్పోయి, వినోదాన్ని కొత్త కోణంలో చూస్తున్నారన్నారు. తద్వారా ఆనందాన్ని కోల్పోయి అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. అలాంటి వాటిని తెలియజేసే ఈ గ్రంథం కళాపీఠం ప్రచురణగా రావడం పీఠానికి గర్వకారణమని అన్నారు. ప్రభుత్వం జానపద కళలను కాపాడే ప్రయత్నాలు చేయాల్సి ఉందన్నారు. ఈసందర్భంగా గ్రంథ రచయిత జ్యోతి చంద్రమౌళిని వివిధ ప్రజాసంఘాలు, సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో గోరంట్ల లక్ష్మీనారాయణ, అన్నమనేని వెంకట్రావు, గాడేపల్లి దివాకర్‌దత్తు, చెన్నుపల్లి నాగేశ్వరరావు, ఎంఈవో వీరాంజనేయులు, పీసీహెచ్ కోటయ్య, జ్యోతి రమేష్‌బాబు, శ్రావణ్‌కుమార్, మన్నం త్రిమూర్తులు, శ్రీమన్నారయణ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఫణీంద్రబాబు, తదితరులు

అక్రమ ఇళ్ల పట్టాలు రద్దుచేయాలి

- సీపీఎం నాయకుడు కొండయ్య డిమాండ్

వేటపాలెం(చీరాల), ఫిబ్రవరి 10: మండల పరిధిలోని సిలోన్ కాలనీలో 27 మందికి రిటైర్డ్ తహసీల్దార్ అశోక్‌వర్ధన్ డబ్బు తీసుకుని అక్రమంగా పట్టాలు ఇచ్చారని, వాటిని వెంటనే రద్దు చేయాలని సీపీఎం నాయకుడు కొండయ్య డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పట్టాలు ఇచ్చిన రిటైర్డ్ తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రిటైర్డ్ తహసీల్దార్ ఉద్యోగ విరమణకు కొద్దిరోజుల ముందు సిలోన్ కాలనీలో 27 మందికి అక్రమంగా పట్టాలు ఇచ్చారని, వాటిని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ రహస్యంగా పంపిణీ చేశారని కొండయ్య ఆరోపించారు. ఇదెక్కడి న్యాయమని తాము ప్రశ్నిస్తున్నామన్నారు. వాస్తవానికి సదరు స్థలాల విషయం కోర్టులో ఉందని, గతంలో పనిచేసిన తహసీల్దార్ ఆ 27 మందికి ప్రత్యామ్నాయ స్థలాలు ఇచ్చారని చెప్పారు. ఆ విషయాన్ని గోప్యంగా ఉంచి ఇటీవల రిటైర్ అయిన తహసీల్దార్ వారికి సిలోన్ కాలనీలో పట్టాలు ఇచ్చారన్నారు. వాటిని రహస్యంగా పంపిణీ చేయటం మోసపూరిత ధోరణికి దర్పణం పడుతుందని కొండయ్య వివరించారు. గతంలో సదరు విషయాన్ని ఎమ్మెల్యే బలరాం, వెంకటేష్ దృష్టికి తీసుకెళ్లారన్నారు. వెంటనే చర్యలు చేపట్టి కాలనీవాసులకు న్యాయం చేయకపోతే సోమవారం నుంచి చీరాల ఆర్డీవో కార్యాలయం వద్ద ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. సమావేశంలో పలువురు కాలనీవాసులు, సీపీఎం బాధ్యులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు కొండయ్య

ఎండీయూ విధానాన్ని రద్దుచేయాలి

- రేషన్ డీలర్లతో సరుకులు పంపిణీ చేయించాలి
- అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లీలా మాధవరావు

అద్దంకి, ఫిబ్రవరి 10: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎండీయూ విధానాన్ని రద్దుచేసి రేషన్ సరుకుల పంపిణీ డీలర్లకు అప్పగించాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లీలా మాధవరావు అన్నారు. అద్దంకి నియోజకవర్గ రేషన్‌డీలర్ల సమావేశం శనివారం సాయంత్రం అద్దంకి పట్టణంలోని బంగ్లా రోడ్డులో చిన్ని శాంతయ్య భవనంలో జరిగింది. ఈసందర్భంగా మాధవరావు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం వలే డీలర్లకు గౌరవ వేతనంతో పాటు కమీషన్ ఇవ్వాలన్నారు. గ్రామీణ ప్రాంత డీలర్లకు రూ.7500, పట్టణాల్లో రూ.10 వేలు గౌరవ వేతనంతో పాటు బియ్యం పంపిణీకి కమీ షన్ ఇవ్వాలన్నారు. గత ప్రభుత్వం కల్పించిన బీమా సౌకర్యం, మృతి చెం దిన డీలర్ల మట్టి ఖర్చులకు రూ.15 వేలు, హెల్త్ కార్డులు, డీలర్ల సంక్షేమ నిధి ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. రేషన్ డీలర్లను కార్మికులు గా పరిగణించి కార్మిక వేతన చట్టం ప్రకారం గ్రామాలలో షాపు నిర్వహణ ఖర్చులు పోను రూ.18,500, పట్టణాలలో రూ.25 వేల ఆదాయం కల్పించాలన్నారు. సమావేశంలో పిన్నింటి గోపికృష్ణ, భాస్కరరావు, నాగేశ్వరరావు, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లీలా మాధవరావు

ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం

చీరాలటౌన్, ఫిబ్రవరి 10: ఆర్టీసీలో సురక్షిత ప్రయాణం పొందవచ్చునని ఆర్టీసీ డిపో మేనేజర్ శ్యామల పేర్కొన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 40 మంది రక్తదానం చేశారు. ఈసందర్భంగా శ్యామల మాట్లాడుతూ అజాగ్రత్త, అతివేగంతో రోడ్డు ప్రమాదాలు ఎక్కువ సంఖ్యలో జరుగుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది, రక్తదాతలు పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీకొని ఒకరు మృతి

బల్లికురవ, ఫిబ్రవరి 10: మండలంలోని వేమవరం నాలుగు రోడ్ల కూడలిలో శుక్రవారం అర్ధరాత్రి రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొనటంతో షేక్ మదర్ (71) అనే వృద్ధుడు మృతి చెందాడు. అందిన సమాచారం మేరకు.. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం లాం గ్రామానికి చెందిన షేక్ మదర్, అల్లాభక్షు వేమరవం వద్ద బాతుడు రాళ్లు కొట్టేందుకు బైకుపై వచ్చారు. వేమరవం వైపు వెళ్లే కట్టప్ప అనేవ్యక్తి ఎదురుగా బైకుపై వచ్చి ఢీకొట్టాడు. ఈప్రమాదంలో తీవ్రగాయాలైన మదర్, అల్లాభక్షును 108లో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మదర్ మృతి చెందాడు. వైద్యశాల నుంచి ఫిర్యాదు మేరకు బల్లికురవ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు పంగులూరులో ఉచిత కంటి వైద్యశిబిరం

పంగులూరు, ఫిబ్రవరి 10: రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కరణం హనుమంతరావు, షేక్ కాలేషావలి తెలిపారు. పంగులూరులోని రోటరీక్లబ్ ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు పరీక్షలు ప్రారంభిస్తారని తెలిపారు. గుంటూరుకు చెందిన శంకర్ కంటి వైద్యశాల డాక్టర్లు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని క్లబ్ డిస్ట్రిక్ట్ ఛైర్మన్ వీరరాఘవయ్య కోరారు.

ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ఆసరా లబ్ధిదారుల ప్రతినిధులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బలరాం, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెంకటేష్

చీరాల, ఫిబ్రవరి 10: ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కరణం బలరాం అన్నారు. మండల పరిధిలోని ఈపురుపాలెం బాయ్స్ హైస్కూల్లో శనివారం 4వ విడత ఆసరా సంబరాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే బలరాం, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ హాజరయ్యారు. మండల పరిధిలోని 1565 పొదుపు సంఘాలకు సంబంధించి రూ.13,69,69,518 చెక్కును సంఘాల ప్రతినిధులకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు, గవిని శ్రీనివాసరావు, ఆసాది అంకాళరెడ్డి, మల్లెల లలితా రాజశేఖర్, బండారు శివపార్వతి, నల్లబోతుల రాజ్‌కుమార్, బుర్ల సాంబశివరావు, బోయిన కేశవులు, బ్రిటా శ్రీనివాసరావు, నాదెండ్ల కోటేశ్వరరావు, ఏపీఎం సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండకు తరలివెళ్లిన దీక్షధారులు

వేటపాలెం(చీరాల), ఫిబ్రవరి 10: పెనుగొండలో ఆదివారం జరిగే శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవానికి వాసవి మాలధరించిన భక్తులు శనివారం పెనుగొండకు తరలివెళ్లారు. ముందుగా వేటపాలెంలో మాలధారులు ఇరుముడులతో నగరోత్సవం నిర్వహించారు. నగరోత్సవంలో భక్తులు మాలధారులకు నీటితో వార్లుపోసి, కొబ్బరికాయలు కొట్టి సాగనంపారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

చీరాల, ఫిబ్రవరి 10: చదువుతో పాటు ఆట, పాటలు అవసరమేనని జిల్లా పవర్ లిఫ్టింగ్ అండ్ టెన్నికాయిట్ అసోసియేషన్ ఛైర్మన్ డాక్టర్ తాడివలస దేవరాజ్ అన్నారు. ఆల్ఫస్ ఇంటర్నేషన్ స్కూల్లో శనివారం నిర్వహించిన స్పోర్ట్స్ మీట్‌లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ మంజునాధ్, పీఈటీలు మమత, శ్రీకాంత్, ఏవో పాలేటి విజయభాస్కర్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం

చినగంజాం, ఫిబ్రవరి 10: మండలంలోని సోపిరాల గ్రామంలో గల లలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలోని హరిహర సుత అయ్యప్పస్వామి ఆలయ ఐదవ వార్షికోత్సవ మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారి ఆధ్వర్యంలో శనివారం ఉదయం 7గంటలకు హోమం, 9గంటలకు అభిషేకాల కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలోని స్వామివారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. గురుస్వాములు స్వామికి పడిపూజా కార్యక్రమాలు నిర్వహించారు. తదనంతరం నైవేద్యం, హారతి ఇచ్చారు. భక్తులు అయ్యప్పస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పట్టుదలతో లక్ష్యాన్ని సాధించాలి

మార్టూరు, ఫిబ్రవరి 10: ఇంటర్మీడియట్‌లో మంచి మార్కులు సాధిస్తే కోరుకున్న లక్ష్యాన్ని సాధించడానికి తొలి అడుగు వేసినట్లవుతుందని శ్రీనివాస విద్యాసంస్థల ఛైర్మన్ వీరగంధం శ్రీనివాసరావు అన్నారు. పట్టుదలతో ప్రయత్నిస్తేనే కోరుకున్న లక్ష్యాన్ని పొందగలుగుతారని చెప్పారు. శనివారం మార్టూరులోని రాయల్ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ విద్యార్థుల వీడ్కోలు సభ జరిగింది. సభకు కళాశాల ప్రిన్సిపాల్ రావి అంకమ్మ చౌదరి అధ్యక్షత వహించారు. కళాశాల పూర్వ విద్యార్థి, ఇండియన్ రెవెన్యూ సర్వీసులో శిక్షణ పొందుతున్న వీరగంధం లక్ష్మీసుజిత మాట్లాడుతూ మొక్కుబడిగా విద్యను కొనసాగిస్తే లక్ష్యాన్ని సాధించలేరన్నారు. ఇంటర్ తర్వాత ఉన్నత స్థానానికి, కోరుకున్న స్థాయికి చేరాలంటే అన్నివిధాలుగా సబ్జెక్ట్‌లపై పట్టు సాధించాలన్నారు. కష్టపడుతూ ఇష్టపడి చదవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సురేష్, అశోక్ పుట్టా శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఇంకొల్లు ఎస్ఐగా మల్లికార్జునరావు

ఇంకొల్లు, ఫిబ్రవరి 10: ఇంకొల్లు ఎస్సైగా ఎస్.మల్లికార్జునరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్సై నాయబ్‌రసూల్ బదిలీ కాగా, ఆయన స్థానంలో ప్రకాశం జిల్లా తాలూకా పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్.మల్లికార్జునరావు నియమితులయ్యారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తామని నూతన ఎస్సై మల్లికార్జునరావు తెలిపారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

బల్లికురవ, ఫిబ్రవరి 10: మండలంలోని ముక్తేశ్వరం పంచాయతీ శివారు రామాంజనేయపురం గ్రామంలో కుంచాల గోపీచంద్ అనే యువకుడు శనివారం పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అందిన సమాచారం మేరకు.. తల్లి మందలించటంతో మనస్తాపానికి గురై పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు గమనించి 108లో నర్సరావుపేటలో వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన దుర్గాభవాని

ఈపూరుపాలెం (చీరాలటౌన్), ఫిబ్రవరి 10: హైజంప్ జాతీయస్థాయి పోటీలకు చీరాల మండలం ఈపూరుపాలెం బాలికోన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కొండేపి దుర్గా భవాని ఎంపికైంది. కడవకుదురులో అండర్ - 16 విభాగంలో పాల్గొన్న భవాని ప్రతిభచూపి ఈనెల 16 నుంచి 18 వరకు గుజరాత్‌లో జరుగుతున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయిని హసేరా, పీడీ రోజ్‌హెల్మా, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.



దుర్గాభవానీని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

క్రీడాకారుడికి చేయూత

చీరాలటౌన్, ఫిబ్రవరి 10: ఖేలో ఇండియా యూత్ గేమ్స్ పోటీలలో మెడల్ సాధించిన చీరాల క్రీడాకారుడు దేవరకొండ ప్రేమ్‌సాగర్‌కు టీడీపీ నాయకుడు ఐఆర్ఎస్ దగ్గుమళ్ల ప్రసాదరావు తోడ్పాటు అందిస్తున్నాడు. ఐదేళ్లపాటు ప్రేమ్‌కు స్పాన్సర్‌షిప్ అందిస్తున్నట్లు శనివారం సంబంధిత పత్రాన్ని అందించారు. ఈసందర్భంగా ప్రేమ్ మాట్లాడుతూ క్రీడల్లో ఎంతో ఉత్సాహంగా ముందుకు సాగుతున్న సమయంలో మంచి అవకాశం వచ్చిందన్నారు. తప్పక వినియోగించుకుని మంచి పేరు తీసుకువస్తానని చెప్పారు.